(సంపుటి - II)



# హరినే అడుగరో ఆమాట

ఇది

ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

భావ దర్పణము





శ్రీరస్తు

శుభమస్తు    అవిఘ్నమస్తు





# హరినే అడుగరో ఆమాట

(సంపుటి - II)

ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

## భావదర్పణము

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

# హరినే అడుగరో ఆమాట
(సంపుటి - II)

మొదటి ప్రచురణ

**అక్టోబర్ 2014**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ ః
**కె.వి.ఆర్.**
98495 79345





## అంకితము



కం॥ పరమాత్ముడొక్కడేనని
శరణంటే చాలు మనని సంరక్షించున్
వరదుడు అతడే, తెలిసెను
సరి అంకితమిత్తుదీని సర్వేశ్వరుకున్

**తా.**॥ మనల్ని పుట్టించి, రక్షించి, శిక్షించి చివరకు భక్షించేది కూడా పరమాత్మయే. పేరేదైనా ఆడ అయినా మగయైనా, జాతి మతము యేదైనా పరమాత్మ ఒక్కడే. మంచి ఆలోచన, మంచిమాట, మంచి నడవడి ఇవే ఆయన మననుంచి కోరుకునేది. "డబ్బు" కావలసింది మనకి ఆ సర్వేశ్వరునకు కాదు. ఆ పరమాత్మకే దీనిని అంకితమిస్తున్నాను.

# హరినే అడుగరో ఆమాట

## (సంపుటి - II)

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు భావదర్పణము

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అందాకావైష్ణవమటమటకే | III/310 | 31 |
| 2. | అందుకే నాపై దయదలచుమాతుర | XV/396 | 34 |
| 3. | అతడే గతియనియంటే | II/511 | 21 |
| 4. | అన్నిటికెక్కుడు యీవి హరి | II/9 | 45 |
| 5. | ఆతడేయజమానుడు ఆదినారాయణుడు | II/237 | 37 |
| 6. | ఇంతగామన్నించి నన్నునేలుకొంటి | III/309 | 17 |
| 7. | ఇంతసేసినవాడవు యికనన్నేల | XV/395 | 36 |
| 8. | ఇంతే మరేమిలేదు యిందుమీదను | XV/75 | 24 |
| 9. | ఇందరునెరుగుదురీయర్థమే | III/261 | 13 |
| 10. | ఇదిగాదదిగాదిన్నియునింతే | III/312 | 19 |
| 11. | ఇదివో మా అజ్ఞానము యెప్పుడు | XV/35 | 04 |
| 12. | ఇటువంటి దుర్గుణి నన్నెట్టు గాచితివో | XV/103 | 22 |
| 13. | ఇవ్వలవెదకితేనేయేమీలేదు | III/308 | 35 |
| 14. | ఈతనికెదురులేదు యెక్కడ చూచినా | XV/156 | 40 |
| 15. | ఉన్నమంత్రాలిందు సరావొగి | II/153 | 27 |
| 16. | ఎంత పుణ్యమో నీకు హీనుని | XV/315 | 50 |
| 17. | ఎక్కడవుపాయములనేమున్నది | XV/316 | 30 |
| 18. | ఎట్టు రక్షించేవో కాని యిందిరారమణ | XV/222 | 08 |
| 19. | ఎన్నడుగలుగు మరి యీ భాగ్యము | II/510 | 25 |
| 20. | ఎన్నడు దీరవు యీ పనులు | III/358 | 11 |
| 21. | ఏపాటి వారికి నాపాటి వాడవు | XV/397 | 20 |
| 22. | ఏమఱకు జీవుడా యేకాలము | XV/270 | 10 |
| 23. | ఏమని విన్నవింతునిదివో | II/224 | 51 |







| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 24. | ఏమీ జదువనేల యెవ్వరినడుగనేల | XV/335 | 46 |
| 25. | ఒడబరచుకొంటివి వుపేంద్ర | II/201 | 43 |
| 26. | కలకాలమెవ్వరికిగా బాటువడె | XV/51 | 18 |
| 27. | కలిగిననాడే చుట్టరికంబుల | III/357 | 01 |
| 28. | గోవింద కేశవ నీకు కుయ్యోమొఱ్ఱో | XV/76 | 16 |
| 29. | తనివి లేక చీకటి దవ్వీదేవి | XV/280 | 06 |
| 30. | తెలిసి బదుకరో దేహులాల | XV/52 | 12 |
| 31. | దొరికెమాపాలికి గందువయర్థము | II/3 | 15 |
| 32. | నిన్నడిగే నానతీవే నేనీపుట్టుగల | XV/337 | 32 |
| 33. | నీదయాధర్మమునకు నీచిత్తము | XV/103 | 48 |
| 34. | నీవే తెలుగు కొమ్మీనీసుద్దులు | XV/172 | 02 |
| 35. | నూతులు దవ్వగబోతే | II/8 | 47 |
| 36. | పంటల భాగ్యులు వీరాబహు వ్యవసాయులు | III/358 | 29 |
| 37. | పట్టరాని సంసారము బయలు | XV/357 | 26 |
| 38. | పట్టరానియాసోదముపాలు | XV/336 | 14 |
| 39. | పాపము పాపము ప్రజలాల | III/350 | 09 |
| 40. | పాపముచేదువ ప్రాణునికి | XV/50 | 44 |
| 41. | పుట్టుగ పుట్టుగ పొద్దొక వింత | XV/76 | 42 |
| 42. | పులుగు చెప్పడినదె పొంచి | II/5 | 41 |
| 43. | ప్రయాసపడవద్దు బయలు వెదకవద్దు | XV/314 | 38 |
| 44. | మానుపవశమా మాయలివిన్నియు | III/360 | 03 |
| 45. | మాయకిదె సహజము మాయను గెలువరాదు | II/240 | 39 |
| 46. | మెచ్చుమెచ్చుకుంటే మాను | II/150 | 49 |
| 47. | వాదము లేటికి వలసినవారికి | XV/157 | 28 |
| 48. | వానివాని సహజమువద్దననేల | III/263 | 07 |
| 49. | వెదకనేటికి నేయి వెన్నచేతబట్టుక | II/506 | 23 |
| 50. | వీధుల వీధుల నెల్లా విష్ణుడు సంచిరంచు | II/487 | 33 |
| 51. | హరి నీకే శరణని గెలుచుటగాక | IV/401 | 05 |

# ప్రార్థన

కం॥ శ్రీవరుని నమ్మి కొలువుడు
నీవారగు హరికి ప్రియులు నీకే ఆపై
కైవల్యము నిప్పించగ
ఆ విష్ణున్ "హరినె అడుగుడామాటనరో"

ఉ॥ శక్తిని నమ్మితిన్ తొలుత శౌరిని గానక పెచ్చుమీరితిన్
రక్తికి ప్రాకులాడితిని లబ్ధికి రూకకు లొంగిపోతిరో
యుక్తికి యుర్విలొంగుననియోగ్యత సంపదగా తలంచితిన్
ముక్తియొసంగు వేంకటపు మూర్తికృపన్ తనబాట పట్టితిన్.

ఆ.వె॥ వెతికి అర్థమెఱుగ విపులీకరించంగ
కొన్ని పదములంటు కొనుటగాక
చేతులెత్తి మొక్కి శ్రీవేంకటేశంటి
స్ఫురణకందుచుండె చోద్యముగను.

చం॥ సరసిజనాభుపాదములు సారసభవ్వుడు కడ్గపావనై,
పరమశివుండుదూకమన పర్వులు వెట్టుచు దూకి కొప్పులో
బిరబిర జిక్కి వానిదయ వెల్వడి భూమిని జేరె గంగయై
నరులది జన్మయా శివ, జనార్దన, బ్రహ్మల నీట దద్వకన్.

కం॥ ఇతనికి సాటిని వెతకిన
ఇతడేయని తెలియునయ్య! ఇలకున్, సిరికిన్
ఇతనిని పతిగా కొలుతురు
ఇతడే భువనాల భర్త ఏలిక మాకున్.

సీ॥ హరికృప యెట్టిదో అరయువాడెవ్వండు?
        వివరించగలిగిన వేత్తయెవడు?
కుంటిని నడిపించు, గుడ్డికి గనులిచ్చు
        అవిటిచే వ్రాయించు నెవడెరుంగు?
కూలిదానినికూడ యేలిక సేయును
        సిరులున్న చినదాని పరువుదీయు,
భక్తుడైగుడికట్టు వానిని చెఱబెట్టు
        నమ్మని వానికి నయము గూర్చు





ఆ.వె॥ చెప్పలేము వాని చేతలు నిజమిదే
శరణు కోరు వానికరుణబ్రోచు
వేంకటేశ! వలదు వేరెవ్వరనువాని
గరుడగమను డెపుడు కాయుచుండు.

తే.గీ॥ నిలువదాయె యీ చిత్తంబు నిమిషమైన
వేద శాస్త్ర జ్ఞానములేదు మదముపోదు
శరణు అనలేను వైరాగ్యమరయబోను
నన్ను యేతీరుబ్రోతువో నళిననాభ!

మత్తకోకిల :
మంచిదో మరి చెడ్డదో "ఇది" మాకు వద్దనకాదురా
యెంచి యిచ్చిన జన్మపుచ్చుక "ఇంగితంబును" వీడకన్
అంచెలంచల దైవభక్తిని ఆ హరీ శరణాగతిన్
నించి జన్మము పూర్తిజేసిన నీకు "మోక్షము" దక్కురా!

శా॥ శ్రీనాథా! ననుగావవే శరణునే చేకొంటిరా నా మనం
బేనాడో నిను ఆశ్రయించి కొలిచెన్ యేనెంచెదన్ సర్వమున్
ఆ నా సప్తగిరీంద్రుడే, అతనికే అర్పింతు జీవంబులన్
నానాపాపములెంచబోకు మిక వోనా దైవమా బ్రోవుమా.

చం॥ మనమున నిల్పెదన్ హరిని మానక కీర్తన నొక్కదానికిన్
దినమున అన్నమయ్యకృతి దీటుగ జెప్పెద భావమంతయున్
కనులకు దర్పణంబరయగా నిలబెట్టినయట్లు మిత్రమా!
మన తిరువేంకటేశ్వరుని మన్నన పొందును శంకయేటికిన్?

మ॥ అదినా భాగ్యము అన్నమయ్య కృతులన్ అందించితిన్ ఇత్తరిన్
పదముల్ సంఖ్యకు రెండువేలు గడచెన్ బంగారు తావబ్బెనో
మదిలోనిల్చిన ఏడుకొండలదొరన్ మాదైవమున్ గొల్చెదన్
ఇదిగోనిద్దియు వానిమెప్పుగొని నా ఇష్టంబు నీడేర్చుగా.

# ముందుమాట

శ్రీవేంకటేశ్వరుని లీలలను వివరించగల సమర్థత నాకులేకపోయినా, నా జీవితంలో నేను స్వానుభవంగా నేర్చిన సత్యాన్ని చాటిచెప్పగల ధైర్యం అర్హతా రెండూ నాకున్నాయి. 2002వ సంవత్సరం జూన్ 16న నేను జీవన్మృతుడనయ్యాను. పక్షవాత వ్యాధిపీడితుడనై కంటిచూపు చెడిపోయి డబల్ విజన్ వచ్చింది. కుడిచెయ్యి కుడికాలు, ఐదవవంతు శక్తితో మేము "పడిపోలేదు" సంతోషించు అన్నట్లు మిగిలాయి. నోరు మూతపడదు. సిగరెట్ తాగే అవకాశం లేదు కాని మాట ఉచ్చారణ స్పష్టంగానే మిగిలింది.

కుడిచేతితో అన్నంతినలేనివాడు, కలం పట్టుకొని ఒక్క అక్షరం వ్రాయలేనివాడు కుక్కతరిమినా పారిపోలేనివాడు బ్రతికి ఉపయోగమేముంది?

శ్రీనివాసుని నేను మనస్ఫూర్తిగా "చావు" కోరని క్షణం లేదు. ఆయన ప్రత్యేకత, ఆయనా నిలుపుకొన్నాడు. ఏమిటది? నీవు కావాలన్నది చేయడు. నీవు కాకూడదన్నది చేస్తాడు అదీ తనిష్టంవచ్చినట్లు చేస్తాడు. సరే! మరి నాగతేమిటి? ఎడమచేత్తోనే తినాలా? జీవితాంతం డబల్ విజన్‌తో చదువుకోలేక వ్రాయలేక బ్రతకాలా? దేనికోసం? నా కోరిక 'ఆయన' తీర్చడని ఆరునెలల్లో అర్థమయింది. ఈకాలంలో నేను చేసిన మంచిపని ఒకటుంది. అది నాబోటి నిర్భాగ్యులకు వుపయోగపడుతుంది. అందుకే 'సోది' అంతా వ్రాస్తున్నాను.

నేను చేసిన మంచి పనేమిటంటే, నా దౌర్భాగ్యానికి యేడ్చానేగాని ఏనాడూ దేవుని నిందించలేదు. త్రికరణశుద్ధిగా ఆయన నా కర్మఫలం నాకిచ్చాడని నమ్మాను. అదే నేను చేసిన మంచిపని. ఆయన నా పశ్చాత్తాపాన్ని మన్నించాడు. ఇంగ్లీషు చదవలేను కాని తెలుగు చదవగలను ఒకప్పుడు తెలుగులో పద్యకవిత చెప్పగల సమర్థత యెక్కడికీ పోలేదు. నా M.Tech. చదువు కురుక్షేత్రంలో కర్ణుని "అస్త్ర"విద్యలా నిరుపయోగం అయింది. కాబట్టి టీచింగ్‌కి పనికిరాను. సోల్డరింగ్ ఐరన్ పట్టుకోలేనివాడు ఇంకేం పనిచేయగలడు? అంతే విరక్తి కలిగి





నా గత జీవితంలోని వారందరినీ త్యజించాను. ఏడుకొండలవాడినే సూటిగా ప్రశ్నించాను. స్వామీ! నీవే గెలిచావు నేను ఓడిపోయాను. కాని నన్నే ఆశతో జీవించమన్నావో చెప్పు. నాగతేమిటి?

అది నేను చేసిన రెండవ మంచిపని. ఆయన నాకు స్ఫురణ కలిగించాడు. ఎలాగైతే ఎడమ చేత్తో స్పూన్‌తో తినటం నేర్చుకొన్నావో యెడమచేతో వ్రాయలేవా? ప్రయత్నించు. మళ్ళీ ఆయన ఆజ్ఞ శిరసావహించాను. రెండు నెలల కృషితో యెడమచేతితో వ్రాయగలిగాను. ఇక నేను వెనుదిరిగి జూడలేదు.

ఆ దేవదేవుడు ఈ జీవికి ధనం గురించిన చింత ఇవ్వలేదు. ఆదిశంకరుల శివానందలహరి వంటి కావ్యాలను తెలుగు పద్య తాత్పర్యాలలో చెప్పాను. తిరుప్పావైని తెలుగు పద్యతాత్పర్య కావ్యంగా చెప్పి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామి వారిని మెప్పించాను. అయ్యప్ప చరిత్ర కూడా చెప్పి అనేక "స్వాముల" మెప్పు పొందాను. సాయిబాబా జీవిత చరిత్ర ఏడు రోజుల పారాయణ కావ్యంగా ద్విపదలో చెప్పాను. గురుచరిత్ర చెప్పాను. చివరికి నా స్వంత "Website" www.geetadeeksha.com పేరుతో ఓపెన్ చేసి పద్యాలలో చెప్పిన భగవద్గీతనుంచి, శ్రీనారాయణ భట్టుతిరి సంస్కృతంలో చెప్పిన శ్రీమన్నారాయణీయం దశమ స్కందం వరకు తెలుగు పద్యతాత్పర్యాలలో అనువదించాను.

దీనికి శ్రీవేంకటేశ్వరుడు తృప్తిచెంది నా జీవిత పరమార్థం నామిత్రులొకరి ద్వారా నాకు తెలియజేశాడు. అదే అన్నమాచార్యులవారి కీర్తనలకు ఉపోద్ఘాత సహితముగా తాత్పర్యాన్ని వివరించడం. నేటివరకు 2025 కీర్తనలు పూర్తిచేశాను. ఇందులో మొదటి 1010 సాక్షాత్తు టి.టి.డి. అన్నమాచార్య ప్రాజెక్ట్ వారే స్వీకరించి నా జీవితం చరితార్థం చేశారు.

భావసామీప్యంగల పలువురు అన్నమయ్య ప్రియులను తృప్తిపరచగలిగాను. ఆ వివరములతో విసిగించి నేను చెప్పదలచిన నా మనోగతాన్ని భ్రష్టుపట్టించుకోను. సృష్టిలో జీవులు కర్మబద్ధులు. భగవంతుడు దీనరక్షకుడే

కాని, ఎవరి కర్మఫలాన్ని వారు అనుభవించక తప్పదు. ఎన్ని జన్మలు పొందినా తీరని కర్మఫలం అనుభవిస్తూనే వుంటాము. అందుకనే మంచికి చెడు, చెడ్డవారికీ మంచి జరుగుతున్నదేమో అనే భ్రమ కలిగి జీవుల్ని భ్రష్టులను చేస్తుంటుంది. ఆయన సాక్షి. ఎవరి మీద రాగద్వేషాలు లేనియోగేశ్వరుడు.

కాబట్టి మన లోపాలకు ఆయన్ని బాధ్యుడిని చేయకండి. అన్నమయ్య కృతులకు నాబోటి అనామకుడు వివరించగలడా? అది ఆయన ఇచ్చిన అనుగ్రహం. కానీ నా తపన, కృషి లేకుండా స్వామీ అంతా నీదే బాధ్యత అంటే ఆయన "పోరాపో" అంటాడు. కాని స్వామి నేను వ్రాస్తాను, నాలో చైతన్యమూర్తివై వ్రాయించు అంటేనే వ్రాయిస్తాడు. అది నేను స్వానుభవంగా నేర్చిన సత్యం. వాళ్ళ కాలిగోటికి తూగనినన్ను, అనేక గొప్ప వ్యక్తులతో అనుసంధానపరచి నాకింత గొప్ప సాఫల్యతనందించాడు ఆ తిరుమలయ్య.

ఇపుడు మీ చేతిలోవున్న ఈ "హరినే అడుగరో ఆమాట" లో అన్నమయ్య భక్తి వైరాగ్య శృంగారకీర్తనలను ఉపోద్ఘాత రహితంగా భావమును దర్పణంలో చూపినట్లు వివరించాలని ప్రయత్నించాను. ఇవన్నీ దాదాపుగా అనాఘ్రాత పుష్పాలు. పండితులు కించిత్ దోషమును ఈ దర్పణంలో పొడగనినా సహృదయంతో మన్నిస్తారని ఆశిస్తాను. నిష్ణాతులే అన్నమయ్య అసలు భావం కనిపెట్టలేక కళ్ళు తేలవేసే సందర్భాలను ఈ సాహిత్యంతో పరిచయమున్న వారెరుగుదురు. ఇక నేనెంత చెప్పండి.

అయినా మానవప్రయత్నం తప్పక చేయాలి ప్రయత్నించేవాడు గట్టెక్కటమో లేక పరాజయంతో ప్రాణాలు కోల్పోవటమో జరుగుతుంది. ప్రయత్నించనివాడు గట్టెక్కే ప్రసక్తేలేదు. నాకు రెండూ ఇష్టమే. అందుకనే నేను తాబేలు మెల్లిమెల్లిగా పొగరుబోతు కుందేలుని జయించినట్లు నాలోని "నిస్సత్తువ" అనే కుందేలుని ఓడించి శ్రీవేంకటేశ్వరుని కృపకు పాత్రుడనైనాను.

ఇది శ్రీహరి సంకల్పమా అన్నట్లు నేను యధాలాపంగా యెన్నుకొన్న కీర్తనలు కూడా ఆణిముత్యాలవంటివి దొరికాయి. ఇవన్నీ (దాదాపు నూటికి తొంబది





ఐదు) అనాఘ్రాతపుష్పాలు. ఔత్సాహిక సంగీత నిష్ణాతులు వీటికి చక్కటి రాగాలు "కట్టి" జనబాహుళ్యంలో ప్రచారానికి తెచ్చి అన్నమాచార్యులవారి దివ్యాశీస్సులు పొందెదరు గాక. నేనిచ్చిన వివరణ చదివిన ఔత్సాహిక విద్వాంసులు భావానికి తగిన రాగం యెన్నుకొంటారని నా ఆకాంక్ష.

ప్రపంచంలో యెవరైన ఈ ప్రయత్నం చేయవచ్చును. ఆస్ట్రేలియాలోవున్న ఒక తెలుగు సోదరి యేహొక్కకీర్తననైనా "భావదర్పణ" వివరణ నచ్చి చక్కటి రాగంలో పాడగలిగితే అది అన్నమయ్య సేవ, శ్రీవేంకటేశ్వరుని పూజ, నాకు తృప్తి. నా జీవితాశయం సిద్ధించినట్లే.

నా ఇతర రచనలు "ఉద్ధవగీత", కబీర్‌దాసు దోహాలు, ఆదిశంకరాచార్యుల "ఆత్మబోధ" (ఆంగ్లంలో) వంటివి మీకు నచ్చుతాయని నా నమ్మకం. GOOGLE NETWORK విజిట్ చేస్తే "geetadeeksha.com" లో నా ఇతర రచనలలు మీరు చదవవచ్చు. 2025 అన్నమయ్య కీర్తనలు విశ్లేషణతో సహా చదవవచ్చు. దాదాపు 1800 కీర్తనలు వినవచ్చునుకూడా.









సంఖ్య : III/357 రాగం : సామంతం పుట: 241

**1 కలిగిననాఁడే చుట్టరికంబులఁ దిరుగు నివి**
**నలుగడ నివి సతమని మతి నమ్మట పాపమయా. ॥పల్లవి॥**

**దేహముతోడనె పెరుగును తీరని యీఇంద్రియములు**
**దేహముతోడనె ముదియును తేటతెల్లమిగను**
**ఆహా పుట్టిననాఁడును అంతమునొందిననాఁడును**
**శ్రీహరిమాయలఁ దగులుక జీవునిఁ దడవ వివి. ॥కలి॥**

**తెలిశున్నపుడే తగులును తియ్యనియీసంసారము**
**తెలివికిఁ బాసినయప్పుడు దిగఁబడుఁ దా నెందో**
**మలయక నిద్రించునప్పుడు మత్తుఁడై యున్నప్పుడు**
**చలమరి జీవునితోడుత సమ్మతమే లేదు. ॥కలి॥**

**కన్నులు దెరచినయప్పుడే కాన్పించును యీలోకము**
**కన్నులు మూసినయప్పుడె కడగడఁ దా నణగు**
**అన్నిట శ్రీవేంకటేశ్వరుఁ డాత్మను వెలిఁగెడివేళను**
**వున్నతిజీవులఁ దగులవు హొదుగుచుఁ దిరుగు నివి ॥కలి॥ 357**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో మానవ కల్పితచుట్టరికములన్నీ నమ్మదగినవికావు, నిలుకడలేనివి అని అంటున్నారు. ఇవి శాశ్వతమని మనస్సులో నమ్మట పాపము సుమా! ఈ భూమిపై నాలుగు దిక్కులా ఇదే పద్ధతి కొనసాగుతున్నది. మన దేహముతోపాటే తీరని ఈ ఇంద్రియములు వాటి ప్రతాపమూ పెరుగుతాయి. అదే విధముగా వయసుపైబడిన ఇంద్రియాల వాంఛలూ తరుగుతాయి. ఆహా! జీవి పుట్టినది మొదలు గిట్టినదాకా శ్రీహరి మాయ తగులక వదలదు కదా! ఇక ఈదేహి వెంపర్లాడే సంసారము గురించి చెప్పుకొందాము. వీడు దీనికి తగిలినప్పటినుంచి తియ్యగానే వుంటుందీ సంసారము. వీడికి స్పృహపోయాక అది యెక్కడ దిగబడుతుందో యెవరికీ తెలియదు. అంతేకాదు, ఈ జీవి నిద్రించేటప్పుడు, మత్తులో వున్నప్పుడూ పంతగాడైన వీడికి ఈ సంసారముతో సంబంధమే లేదు. మరి ఈ సంసారముపై వీడికి భ్రమ యేల? ఇక వీడుంటున్న లోకము సంగతి చూద్దాము. ఈ లోకము వీడికి కన్నులు తెరిచినప్పుడే కనుపిస్తుంది. కన్నులు మూసినాడంటే, కొట్టకొన యెక్కడో అణగిపోతుంది. ఈ పీకులాటలన్నీ జీవికి సహజమే. అయితే శ్రీవేంకటేశ్వరుని కృపచే వీడి ఆత్మలో ఆయన వెలిగినవేళ జీవునికి ఉన్నతి కలిగి ఆ భ్రమలు అతనినేమీ చేయలేవు.

★ **కడగడ** – కొట్టకొన ★ **చలమరి** – పంతగాడు



హరినే అడుగరో ఆమాట

సంఖ్య : XV/172 రాగం : ముఖారి పుట: 115

**2 నీవే తెలుసుకొమ్మీ నీ సుద్దులు**
**రావిచిగురంటుకొంటే రాఁ బోను వచ్చునా ॥పల్లవి॥**

**పొందుగాని గొల్లెతల పొందు నీవు సేసితేను**
**నింద రాక మానునా నీకైనాను**
**అందముగ నిన్ను వారియంగములు సోఁకితేను**
**విందువలె గొల్లముంజు వేయకుండీనా ॥నీవే॥**

**కూడగొట్టువనితల కోరి పెండ్లాడితేను**
**ఆడుకోకుండుదురా అంగళ్ల నెల్ల**
**ఆడవారు తమతమ అధరములు మోవీఁగా**
**యీడులేని నీ మోవి యెంగిలి గాకుండునా ॥నీవే॥**

**యియ్యని రాచకూఁతు నెత్తుకొని వచ్చితేను**
**నెయ్యపు శ్రీవేంకటేశ నిన్నునవ్వరా**
**యియ్యెడ నన్నుఁ గూడె వీపె నింత సేసితేను**
**వుయ్యాలగా రొమ్ముదొక్కి వుండ కిట్టే మానునా ॥నీవే॥ 172**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య వినిపించిన ఈ కీర్తనలో ఆయన స్వామితో యేమంటున్నారంటే, స్వామీ? నీ కథలు నీవే తెలుసుకోవయ్యా, ఊరకనే అంటుకొనే రావి బంక తగిలినదంటే మనకు 'రాఁబోను' వస్తుందా? (రావటం, పోవటం సాధ్యమౌతుందా). నిజమే, నీవు శ్రీకృష్ణుడవు, దేవదేవుడవు. కాని, నీకు నీవే గొల్లెతలకు చనువునిచ్చి వారితో పొందుచేస్తే నీకైనా నిందరాకమానుతుందా? నీవు వారి అంగములతో అందముగా స్పృశిస్తే నీకు విందుగా ఆ గొల్లెతల ఒంటినుంచి వచ్చే "కంపు" అంటుకోకుండా వుంటుందా? స్వామీ! నిన్ను కోరివచ్చారని కనబడ్డ వనితనెల్లా పెళ్ళాడితే, వారు తరువాత తమ అసలు రూపం చూపకుందురా? అంగళ్ళలో నిన్ను అమ్మివేయకుందురా? ఆడవాళ్ళంతా నీకు తమతమ అధరామృతాలనిచ్చారు కదా! అని నీవు స్వీకరిస్తే, ఆదిమూర్తివైన నీ మోవి యెంగిలైనది కాని, వారికేమి నష్టము? ఓ శ్రీవేంకటేశ్వరా! పెళ్ళాడుతానని నీవు అంటే, ఆనాడు రుక్మిణిని యెత్తుకొనిపోయి రాక్షస వివాహం చేసికొన్నావని నిన్ను చూచి నవ్వకుందురా? నేడు నావంటి వారిని కూడా ఆదరించే నిన్ను నమ్మలేక 'ఆవిడ' నీ రొమ్ముపైనెక్కి కూర్చున్నదయ్యా! అట్లాకాక మానునా?

★ **కూడగొట్టు** – కోరి కూడివచ్చారని ★ **ఇయ్యని** – వధువుగా నీకు నిశ్చయించని

సంఖ్య : III/360 రాగం : శంకరాభరణం పుట: 243

**3 మానుపవశమా మాయ లివిన్నియు**
**శ్రీనాథుఁడు మును సేసినవే ॥పల్లవి॥**

**రాతిరి చీఁకటి రతిఁ బగలు వెలుఁగు**
**ఘాతల నెప్పుడు గలదిదియే**
**యీతల జ్ఞానుల కిల నజ్ఞానుల -**
**జాతివైరములు సహజములే. ॥మాను॥**

**అసురలకు సురల కనాదినుండియు**
**అసమున వైరంబది గలదే**
**యెసగి వైష్ణవుల కిలఁ బ్రాకృతులకు**
**పొసఁగనివాదము భువిఁ గలదే. ॥మాను॥**

**యిహమునుఁ బరమును యీలంకెలతో**
**విహితము చెప్పెడి వేదములే**
**అహిపతి శ్రీవేంకటాధిపుమతమిది**
**నిహితం బెఱిఁగిన నిశ్చలమే. ॥మాను॥ 360**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీనాథుని సేతలను కొనియాడుతున్నారు. శ్రీనాథుడు సేసిన ఈ మాయలను మానుపవశమా (లేకుండునట్లు సేయుట మనవలన అవుతుందా?) అని అడుగుతున్నారు. ఆయన సమర్ధన వినండి. ఎప్పుడూ పగలు, చీకటి అనుసరించి వస్తూనేవుంటాయి. రేయి చీకటిలో 'రతి' పగలు వెలుగులో జీవనోపాధి తప్పదు. ఇది చావువలె అనివార్యము. అనాదిగా జ్ఞానులకు, అజ్ఞానులకు జాతివైరము సహజంగా వస్తున్నదే. దీనిని మానుపవశమా? రాక్షసులకు, దేవతలకు వైరము అనాదిగా వస్తున్నదే. సర్వం విష్ణుమయము అనే వైష్ణవులకు, సర్వమూ ప్రకృతి వల్లనే జరుగుతున్నదని వాదించే నాస్తికులకు పొసగని వాదము అనాదిగా వస్తున్నదే. భూమిపై, ఇది ఇవాల్టి సమస్య కాదు. పరమాత్మను నమ్మేవారు పరలోకము గురించి ఆలోచిస్తారు. ప్రకృతియే సృష్టికి కారణమనేవారు ఇహలోకముల గురించే ఆలోచిస్తుంటారు. వేదములు విహితమైన సన్మార్గమును ప్రబోధిస్తాయని అందరూ నమ్ముతారు. అహిపతియైన ఆదిశేషునిపై పరుండు శ్రీవేంకటేశ్వరుని మతమిదియె. అది గుణకరము. నిశ్చలమైనదిగా తెలియబడినది.

★ **నిహితము** – గుణకరము ★ **ఘాతల** – చావువలె





సంఖ్య : XV/35 రాగం : దేసాళం పుట: 23

**4 ఇదివో మా అజ్ఞానము యెప్పుడును సహజమే**
**కదిలి నీవే నన్నుఁ గరుణించవయ్యా ॥పల్లవి॥**

**తల్లి చంకనున్న బిడ్డ తమతోఁ జన్ను దాగుతా**
**వొల్లఁడు తండ్రి యెత్తుకో నొగిఁబోతేను**
**మల్లడ నీ మాయలో మరిగిన జీవముల**
**మెల్లనే మీ సేవసేసి మిమ్ముఁ జేరఁ జాలము ॥ఇది॥**

**రెక్కల మరుఁగుపక్షి రెక్కల కిందనే కాని**
**యెక్కుదు వద్దనే మేడ యెంత వున్నాను**
**పక్కన జన్మమెత్తిన ప్రపంచపు జీవులము**
**యెక్కుడైన వైకుంఠ మిది గోరఁ జాలమూ ॥ఇది॥**

**నీరులో నుండేటి కప్ప నీటిలోనే వుండుఁగాని**
**వూరకే పరపుమీద నుండ దెంతైనాను**
**ఆరయ సంసారములో అజ్ఞానపు జీవులము**
**బోరన శ్రీ వేంకటేశ బుద్ధి చెప్పి కావవే ॥ఇది॥ 35**

**భావ దర్పణము :**

పెద తిరుమలయ్య వినిపించిన ఈ కీర్తనలో తన అజ్ఞానాన్ని నిరసిస్తున్నారు. మా సహజమైన అజ్ఞానము ఇదిగో మమ్ము వీడదు. పూని నీవే మమ్ము కరుణించి దానిని తొలగించాలి. లేకున్న మేము దీనినుంచి విముక్తులం కాలేము, అంటున్నారు. ప్రభూ! నీవు మా తండ్రివి. నీమాయ తల్లి వంటిది. అది కలిగించే సుఖం మమ్ము మా తండ్రినుంచి దూరం చేస్తోంది. చన్ను కుడిచే పసిబిడ్డ తండ్రి యెత్తుకొంటాను రమ్మంటే తల్లి చంక దిగడు. మా పరిస్థితీ అంతే మెల్లగా నీ సేవచేసి మిమ్మల్ని పొందాలని తెలిసినా ఆ మాయ మమ్ము వదలదు. తల్లి పక్షి రెక్కల కింద వెచ్చగా సుఖంగా వుండే పక్షి పిల్లలు, పక్కనే వున్న మేడలో యెంత వెచ్చగా, హాయిగా వున్నా, తల్లి రెక్కల వెచ్చదనాన్నే ఇష్టపడతాయి. ఈ మాయా ప్రపంచంలో పుట్టి బ్రతికే బడుగు జీవులమైన మేము నీ వైకుంఠాన్నే వద్దంటాము. ఈ సంసారమే సుఖము అంటాము. ఎంత ప్రయత్నించినా, ఒక కప్ప మెత్తటి పరుపుమీద హాయిగా వుండదు. పాచిబట్టిన మురికి నీటిలోనే దానికి హాయి. అజ్ఞానపు జీవులమైన మేము ఈ సంసారములో పడి మత్తులో వున్నాము. ఓ శ్రీవేంకటేశ్వరా! మాకు బుద్ధిచెప్పి రక్షించి నీ దారిలో పెట్టుకోవయ్యా!

★ **కదివి (సి)** – చేరువయై ★ **మల్లడ (డి)** – పెనవేయు ★ **బోరన** – శీఘ్రముగా

సంఖ్య : IV/401 రాగం : గుండక్రియ పుట: 269

**5 హరి నీకే శరణని గెలుచుటగాక**
**యిరవుగ నెరఁగఁగ నెవ్వరితరము** ॥పల్లవి॥

**తనువికారములు తరవులు వెట్టిన**
**కొనయెరుకైనా కొరతవడు**
**మనసువికారము మమతలఁ దగిలిన**
**యెనసి ఎదురుపడ నెవ్వరితరము** ॥హరి॥

**కంతువికారము కన్నులఁగప్పిన**
**పంతపు విరతియు బయలౌను**
**చింతాలహరులు చీఁదర రేఁగిన**
**యింతయు వీడ్కొనవె (నె?) వ్వరితరము** ॥హరి॥

**అతిగుణవికార మాసలఁ బెట్టిన**
**సతతయోగములు జడనుపడు**
**మతి శ్రీవేంకటపతి నిన్నుఁ గొలిచిన**
**యితరము దగ్గర నెవ్వరితరము** ॥హరి॥ **401**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో ఒక గొప్ప రహస్యాన్ని వెల్లడిస్తున్నారు. శ్రీహరిని సాధించాలంటే, తన కరుణ గెలవాలంటే స్వామి శరణాగతియే చక్కటి మార్గము. ఎందుకంటే ఆయనను పూర్తిగా నెరుగుట ఎవ్వరి తరమౌతుంది? అటువంటప్పుడు శరణమే సులభము. మానవుని శరీరము కలిగించు వికారములు నిర్బంధించినప్పుడు, దాని తుది పరిణామం తెలిసినా కొరత మిగిలిపోతుంది. అదే మనస్సు కనుక వికారమునకు లోనైతే మమతల వుచ్చులో తగిలి భ్రాంతి చెందుతుంటుంది. అప్పుడు దాని నెదుర్కొనుట యెవ్వరి తరము? మన్మథ వికారము కన్నులను కప్పివేస్తే పంతముతో కూడిన విశ్రాంతి అవసరమౌతుంది. చింతితుడై చిరాకు కలిగినప్పుడు దీనినంతా ఒక్కసారిగా విడిచిపెట్టడం యెవ్వరి తరమౌతుంది చెప్పండి. గొప్పగుణవికారముచేత, ఆశలో తగులుకొని యెల్లప్పుడూ యోగసాధనలో కూడా వెనకపడిపోవటం జరుగుతుంది. ఓ శ్రీవేంకటపతీ! అప్పుడు మనస్సులో నిన్ను కొలిచినవానికి విషయములు దగ్గరవవు. అట్లా ఆ శరణాగతులను చెడగొట్టుట యెవ్వరి తరము.

★ **జడనుపడు** – మందమతియై వెనకపడిపోవును
★ **విరతి** – విశ్రాంతి ★ **తరవులు** – నిర్బంధము





సంఖ్య : XV/280 రాగం : లలిత పుట: 198

**6 తనివి లేక చీఁకటి దవ్వీ దేహి**
**ఘనుఁడై హరిఁ గొల్చితే కైకొని రక్షించఁడా** ॥పల్లవి॥

**అంది రసవాదమున కాసపడేటి మనసు**
**గొంది బిలములు చొచ్చి కూడపెట్టేటి మనసు**
**సందించి మంత్రవాదాన సాదించేటి మనసు**
**యిందిరేశుపైఁ బెట్టితే నిన్నియు నొసఁగఁడా** ॥తనివి॥

**నెట్టన నంజనగాఁడై నేల దవ్వించే మనసు**
**అట్టే కాయసిద్ధికిఁగా నాసపడేటి మనసు**
**పట్టి సిద్ధమూలికలవసఁ జిక్కేటి మనసు**
**దిట్టయై కృష్ణుని మీఁదఁ బెట్టితే మన్నించఁడా** ॥తనివి॥

**చేరి యక్షిణుల పంపు సేయించుకొనే మనసు**
**ఆరయ రాక్షసమాయ నభ్యసించేటి మనసు**
**యీరీతి శ్రీవేంకటేశు హృదయములోఁ దలఁచి**
**పేరుకొని నుతించితే పెంపున నడేర్చఁడా** ॥తనివి॥ **280**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ అధ్యాత్మ కీర్తనలో దేహి లేక జీవుడు శ్రీహరిని కాదని తృప్తి నెఱుంగక చీకటినే తవ్వి పోస్తూ వెలుగు చూడలేకున్నాడు. ఇన్ని అగచాట్లు పడేకంటే హరిని శరణని కొలిచితే, స్వీకరించి నిన్ను రక్షించడా అంటున్నారు. ఈ జీవుడి మనస్సు హరిని కాదని వేటి వెంటబడుతున్నాడో చూడండి. మనసా! నీవు హరిని కాదని "రసవాదము" నకై ఆశపడుతున్నావు. పాదరసముతో బంగారము చేద్దామని నీ దురాశ. ఏవేవో బిలములలో చొచ్చి తార్పుడు పనులు చేస్తున్నావు. మంత్రవాదివై (మాంత్రికుడవై) మంత్రవిద్యలు అభ్యసిస్తావు. కాని ఓ మసా! ఈ సాధన ఇందిరా రమణునిపై పెడితే ఆయన నీకేదైనా ఇస్తాడు కదా! ఓ మనసా! అంజనగాడై (అంజనం వేసిచూసి నిధి, యెక్కడ వున్నదో కనిపెట్టేవాడు) నేలను తవ్వించి నీవు సాధించేదేమిటి? 'కాయసిద్ధి'కి (జూదములో కావలసిన పందెం పడేట్లు చేసే విద్య) సాధించి విపరీతంగా ధనమునార్జించాలని వెంపర్లాడతావు. సిద్ధ మూలికా వైద్యం నేర్చి తగ్గని రోగాలను తగ్గిస్తానని నమ్మిస్తావు. ఓ మనసా! ఈ పనికిరాని వాటి బదులు శ్రీకృష్ణునిపై నిలుపరాదా? మనసా! యక్షిణీల (గతించిన వృత్తాంతము చెప్పే విద్యగల స్త్రీలు)ను పంపకము సేసి గడించాలని చూస్తావు. రాక్షసమాయలనభ్యసించి అందరినీ వశపరచుకో చూస్తావు. వీటి బదులు శ్రీవేంకటేశ్వరుని నీ హృదయంలో ధ్యానిస్తే, నుతిస్తే నీకోర్కెల నీడేర్చడా?

★ **పెంపున** – గౌరవముగా ★ **నెట్టన** – తప్పకుండా

సంఖ్య : III/263 రాగం : దేసాళం పుట: 178

**7** వానివానిసహజము వద్దననేల
యీనేటిప్రపంచ మది యేమిసేయఁగలదు. ॥పల్లవి॥

హరి పుట్టించినయట్టి ఆయాప్రకృతులను
విరసాలఁ దిప్పేమంటే వేరొకటౌనా
పరమజ్ఞాన మొక్కటే పాటించితేఁ జాలు
యెరవుల పుణ్యపాపా లేమిసేయఁగలవు. ॥వాని॥

బలువుగ విష్ణుమాయఁ బ్రబలేసంసారమును
చలమున దిద్దఁబోతేఁ జక్కనౌనా
తెలివితో హరిభక్తి తెగక వుండితేఁజాలు
యిలపైఁ బంచేంద్రియము లేమిసేయఁగలవు. ॥వాని॥

శ్రీ వేంకటేశుఁ డాత్మఁ జేకొని వుండినది
భావించకున్న నాతఁడు బడివాసీనా
సావధానాన నీతని శరణనుకొంటేఁజాలు
యేవిధులు భవములు నేమి సేయఁగలవు. ॥వాని॥**263**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో ప్రకృతి, హరి మాయావిలాసము, జ్ఞానము, హరిభక్తి, హరి శరణాగతి గురించి ప్రస్తావిస్తూ... వానివాని సహజ గుణములననుసరించి అవి నడుచుకొంటున్నవి. వాటిని వద్దననేల? ఈ ప్రపంచమేమో జీవులను ఈనుతూనె వుంటుంది. అది మరేమి సేయగలదు? అని ప్రశ్నిస్తున్నారు. అనేక జీవులను పుట్టించిన శ్రీహరి ఆయా ప్రకృతులనూ సృజించినాడు. ఆ ప్రకృతిని విరసాన తిప్పేమంటే అది జీవుల తప్పు వేరొకటౌనా? జీవులు పాపపుణ్యాల గురించి లెక్కసేయుటయెందుకు? పరమజ్ఞానమొక్కటే చాలదా? ఈ పాపపుణ్యాలేమి చేస్తాయి? ఈ సంసారములో విష్ణుమాయ విజృంభిస్తూ వుంటుంది. పంతము పూని దానిని సరిదిద్దుతానంటే జరిగేపనేనా? హరిభక్తిని మన స్పృహ వున్నంత వరకు విడువకుండా వుంటే చాలును. అటువంటి భక్తుడిని పంచేంద్రియాలు యేమిచేస్తాయి? ఏమీ చేయలేవు. మన ఆత్మ శ్రీ వేంకటేశుని చేకొనివుంటే చాలును. ఆస్వామి రూపం భావించలేకపోయినా ఆయన మనని విడనాడునా? సావధానుడై జీవుడు ఆయనను శరణువేడితే చాలును, విధికాని జన్మలుకాని ఈ జీవుని యేమిసేయగలవు?

★ **ఎరవుల** – అప్పు తెచ్చుకొనిన ★ **సావధాన** – శ్రద్ధగా





సంఖ్య : XV/222 రాగం : రామక్రియ పుట: 148

**8** ఎట్టు రక్షించేవో కాని యిందిరారమణ నన్ను
దట్టపు నీ దాసానుదాసుఁడ నేను ॥పల్లవి॥

గాటపు వైరాగ్యము కందువ సుజ్ఞానము
మాటలలోననే కాని మతి నుండదు
నీటున నహంకారపు నీరసగుణములు
మాటునఁ దిరుగు దుర్మానుఁడ నేను ॥ఎట్టు॥

నవనవవిధముల నానాపుణ్యము
చెవుల వినుటే కాక సేయుట లేదు
భవజలధులలోన పడి పొరలి మునిఁగి
చవి మరిగిన నిత్యచపలుఁడ నేను ॥ఎట్టు॥

శ్రీవేంకటేశ్వర నీ సేవకుఁడ ననియేటి
భావ మొక్కటె కాని భక్తి యెఱుఁగ
యేవిధులఁ బడలేక యిటు నీకె శరణని
దేవులతో విఱ్ఱవీఁగే డింగరీఁడను ॥ఎట్టు॥**222**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న ఈ కీర్తనలో ఇందిరారమణుడిని వేడుకొంటున్నారు. "నేను నీ దాసానుదాసుణ్ణి. నన్నెట్లా రక్షిస్తావో అది నీ ఇష్టం" అంటున్నారు. అన్నీ ఆ దేవదేవునికే వదలివేసి ఆయనదే భారమనడమే శరణాగతి. ఇక నాగురించి యెంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిది. నేను ఒక దుర్మానుడను. నేను సాటిలేని వైరాగ్యం వల్లిస్తుంటాను. గొప్ప సుజ్ఞానము నా మాటలలో తాండవిస్తుంది. కాని మనస్సులో వుండదు. చెప్పలేని అహంకారంతో గూడిన రసహీనమైన గుణముల మాటున తిరుగుతుంటాను. ఇటువంటి అధమాధముణ్ణి యెట్లా కరుణిస్తావు ప్రభూ? స్వామీ! నవ విధ భక్తుల గురించి, అనేక పుణ్యకర్మల గురించి వినటమేకాని ఆచరణలో శూన్యం. ఈ చెవితో విని ఆ చెవితో వదలివేసే రకం, నేను. నిత్య చపలచిత్తుడనైన నేను, పుట్టుకలనే ఈ సాగరంలో మునిగిపోతూ పొర్లుకొంటూ దీంట్లో వుండే యౌవన చాపల్యం సులభమనుకొంటూ దానికి మరిగి నిన్ను కానలేకున్నాను. ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ సేవకుడిననే భావనతోనే వున్నాను, కాని అది అనన్య భక్తి అనటానికి వీలులేదు. ఈ విధివిధానముల గొడవ పడలేక నీకు శరణని భార్యలతో విఱ్ఱవీగినా, నీ సేవకుడినయ్యా! నన్నెట్లా రక్షిస్తావో నీ ఇష్టం.

★ **డింగరీడు** – సేవకుడు ★ **దట్టపు** – విశాలమైన

సంఖ్య : III/350 రాగం : దేవగాంధారి పుట: 236

**9 పాపము పాపము ప్రజలాలా**
**పైపై నిటువలెఁ బలుకకురో.** ॥పల్లవి॥

**హరియందుఁ బుట్టినజుఁడును శివుఁడును**
**హరితో సరి వీరను టెట్లూ**
**పొరిఁ గొండలందుఁబుట్టినశిల లివి**
**సరుసఁ బెట్టితే సరియౌనా.** ॥పాప॥

**యిందిరాధిపుని విలఁగలసిరులివి**
**అంది మరొకరివి అనుటెట్లు**
**కొందరము యేరు గుడిచి కాలువలఁ**
**బొంది పొగడితేఁ బొసఁగీనా.** ॥పాప॥

**శ్రీవేంకటపతిసేవకులకు సరి**
**ఆవల మరి కలరనుటెట్లు**
**కావించిన యల కామధేనువుల -**
**కేవి యూరఁబసు లీడవునా.** ॥పాప॥ **350**

**భావ దర్పణము :**

అన్నమాచార్యులవారు విశిష్టాద్వైత మతం స్వీకరించాక ఆ మతగురువుల సమక్షంలో శివుని, బ్రహ్మను, విష్ణువు కంటె అల్పులుగా చిత్రీకరిస్తూ కీర్తనలు చెప్పారు. అది వారి హృదయాంతరాలలోంచి వచ్చిన భావనలని నాకనిపించదు. పరబ్రహ్మతత్త్వమెరిగిన వానికి హరిహరులు సమానమే. కాని ఈ కీర్తనలో అన్నమయ్య యేమంటున్నారంటే, ప్రజాలారా! పైపై మాటలు చెప్పకండి. పాపము మీకు అంటుతుంది. అజుడు (బ్రహ్మ) హరినుంచే పుట్టాడు కదా! శివునికి ప్రాణదానం అనేకమార్లు చేశాడు హరి. మరి వీరంతా సమానమెలా అవుతారు? శ్రీహరి కొండవంటివాడైతే, ఆ కొండలోని శిలలు వారిరువురూ. వారందరినీ సరగుబెట్టుట న్యాయమా చెప్పండి. ఇలగల సిరులన్నీ ఇందిరాపతివి. మీరు శ్రీమంతులైతే దానికి కారణం హరి. ఆయనవల్ల సిరిని పొంది ఇంకొకరిని స్తుతించవచ్చునా? మనము ఏరులోని నీరుత్రాగి బ్రతుకుతూ కాలువలోని నీళ్ళను పొగడవచ్చునా? అది పొసగుతుందా? చెప్పండి. శ్రీహరిని సేవించేవారు, శ్రీవేంకటపతికి సరి అనుట యెట్లు పొసగుతుంది. ఇంద్రుని వద్దనున్న కామధేనువును మనవూరిలో వుండే పాడి ఆవుతో పోల్చి రెండూ ఒకటేననుట న్యాయమేనా చెప్పండి.

★ **పొసగీనా** – కుదురుతుందా ★ **పొరి** – దృఢమైన





సంఖ్య : XV/270 రాగం : శుద్ధవసంతం పుట: 182

**10 ఏమఱకు జీవుఁడా యే కాలమూ**
**నేమముతో నుండితేనే నిలుచును కాలము** ॥పల్లవి॥

**కడఁగి జూజమాడితేఁ గడచీని కాలము**
**నడుమ వేఁటలాడితే నడచీని కాలము**
**జడియుచు నిద్రించితే జరగీని కాలము**
**నిడివి హరిఁ గొల్చితే నిండుకుండుఁ గాలము** ॥ఏమ॥

**సతులసంగడి నున్నసమసీని కాలము**
**వెతలఁ బొరలినాను వెళ్ళీని కాలము**
**సతతము దొంగిలినా చనిపోయీఁ గాలము**
**వ్రతియై యుండితేను వసమౌను కాలము** ॥ఏమ॥

**పాలుమావి వుండినాను పరివోవుఁ గాలము**
**కూళగోష్టినుండినాను కొంచపడుఁ గాలము**
**మేలులో శ్రీవేంకటేశు మేటికతలు వినుచు**
**తాలిమితో నుండినాను దక్కి యుండుఁ గాలము** ॥ఏమ॥ **270**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య భావన వినండి. జీవుడు దేహం పొందిన తరువాత టిక్, టిక్ మని గడిచిపోయే కాలానికి దాసోహమనక తప్పదు. నియమముతో జీవితం గడపనివారికి అది నిలువదు. హారతి కర్పూరంలో హరించుకుపోతుంది కాబట్టి జీవుడు "ఏమరక" వుండి తనకు లభించిన కాలాన్ని సద్వినియోగం చేసికొని తరించాలి, అంటున్నారు. కాలము గడుపుటయే చాలు అనే వ్యర్థులు దాన్ని వ్యర్థం చేస్తూనే వుంటారు. జూదమాడినా కాలం గడిచిపోతుంది. వేటాడేవాడికీ కాలం గడచిపోతుంది. నిద్రలో యెంతకాలమైనా గడుపవచ్చును. కాని పైవాటిని కాలము వ్యర్థపరచటం అంటారు. శ్రీహరిని గొలిచి కాలము గడిపేవానికి అకాలము నిండుకుండలాగ మేలు చేస్తుంది. భార్యలతో సరససల్లాపాలలో గడిపేవానికి కాలం సమసిపోతుంది. అనేక చీకాకులు, బాధలలో గడిపేవానికి కాలము కుంటుతూ నడుస్తుంది. దొంగతనం చేసేవాడికి కాలము తెలియకుండానే గడిచిపోతుంది. పైవాటివల్ల వాడి అంత్యకాలము వచ్చేదాకా వాడికే తెలియదు. కాని శ్రీహరి భక్తి అనే వ్రతములో గడిపేవానికి కాలము వాడి వశమౌతుంది. సోమరిగా వూరకనే కూర్చొనివున్నా కాలము గడచిపోతూనే వుంటుంది. కూళులతో (నీతిబాహ్యులతో) గడిపినా కాలము కొంచెపడుతుంది (తరిగిపోతూనే వుంటుంది). అయితే శ్రీవేంకటేశుని మేటికథలు వింటూ గడిపే కాలమే క్షమతో దక్కి జీవికి చివరికి వుపయోగపడుతుంది. మళ్ళీ రమ్మంటే రానిదే కాలము.

★ **పాలుమాలివుండు** – సోమరిగావుంటే ★ **పరివోవు** – గడచిపోవును

సంఖ్య : III/348    రాగం : బౌళి    పుట: 234

**11 ఎన్నఁడుఁ దీరవు యీపనులు**
**పన్నిన నీమాయ బహళంబాయ ॥పల్లవి॥**

**పెక్కుమతంబుల పెద్దలు నడచిరి**
**వొక్కసమ్మతై వొడఁబడరు**
**పెక్కుదేవతలు పేరువాడెదరు**
**తక్కకక ఘనులము తామేయనుచు. ॥ఎన్నఁ॥**

**పలికేటిచదువులు బహుమార్గంబులు**
**కలసి యేకవాక్యత గాదు**
**చ(ఛ?)ల వాదంబులు జనులును మానరు**
**పలుతర్కంబులె పచరించేరు. ॥ఎన్నఁ॥**

**శరణాగతులకు శ్రీవేంకటేశ్వర**
**తిరముగ నీవే తీర్చితివి**
**పరమవైష్ణవులు పట్టిరి వ్రతము**
**యిరవుగ నాచార్యు లెరుఁగుదురు ॥ఎన్నఁ॥ 348**

**భావ దర్పణము :**

ఇక్కడ “పనులు” అంటే కర్మములు అని అర్థము. అన్నమయ్య యేమంటున్నారంటే ఓ దేవా! నీవు మాకు విధించిన కర్మలు ఒక నాటికి తీరేవి కావు. ఎందుకిలా అవుతున్నదంటే, నీవు పన్నిన మాయాజాలం అటువంటిది. అది బహుళంబాయె (అనేకరకములుగా వుంటుంది). అనేక మతములకు చెందిన పెద్దలు దేనిలోను సమ్మతించరు, ఒడబడరు. వారు అనేకమంది దేవతల పేర్లు వాడుకొనే ఘనులు ఇంకొంతమంది వుంటారు, వారు సంకోచించకుండా తామే దేవుని అవతారాలమని చెప్పుకొంటుంటారు. చెప్పుకొనే చదువులు బహుమార్గములుగా వుంటాయి. అవి ఒకేమాట నెన్నడూ చెప్పవు. ఈ జనులున్నారే, వీరు యెన్నడూ పరులపై నెపమువేస్తూ వాదించడం మానరు. రకరకములైన తర్కములతో వారు తమ పబ్బం గడుపుకొంటుంటారు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ శరణాగతులను స్థిరచిత్తులుగా నీవే తీర్చిదిద్దితివి. పరమవైష్ణవులైనవారు ఒక వ్రతమును పట్టినారు. అదే ప్రపన్నత. దానినెట్లు ఆచరించవలెనో మా ఆచార్యులెరుంగుదురు.

★ **పన్ని**–వ్యూహరచనచేసిన ★ **ఛలవాదము**–ఇంకొకరిపై నెపమువేస్తూ చేసే వాదము





సంఖ్య : XV/52    రాగం : గుజ్జరి    పుట: 35

**12 తెలిసి బదుకరో దేహూలాల**
**వలెనని తలఁచినవారివాఁడే దేవుఁడు ॥పల్లవి॥**

**తనుఁ గొలువకూడితే తారము వెట్టఁ దేలిక**
**పెనఁగి కొలువకున్నఁ బెట్టు దేవుఁడు**
**జునుగుచు విడుతురు చుట్టాలు దరిద్రులైతే**
**వెనువెంటా నెంతయినా విడువఁడు దేవుఁడూ ॥తెలిసి॥**

**అంతట ముదిసితేను అంగనలు రోతురు**
**అంతరాత్మ యెన్నఁడు రోయఁడు దేవుఁడు**
**వింతగా నన్నఁ దమ్ములు విసాన (?) కలుగుదురు**
**పొంతనే తా నలుగఁడు పుట్టించిన దేవుఁడు ॥తెలిసి॥**

**వొదిగి మూల నుండితే వూరివారు మఱతురు**
**వదల కెందున్నా మఱవఁడు దేవుఁడు**
**తుదిముట్ట రక్షించు దుఃఖము లెల్ల నణఁచు**
**యెదుట శ్రీవేంకటేశుఁ డితఁడె పో దేవుఁడు ॥తెలిసి॥ 52**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో దేహులైన మానవులను తమ కర్తవ్యం తెలిసి బ్రతుకుడని హెచ్చరిస్తున్నారు. ఆ పరమాత్ముడు మన తండ్రియైనా ఆయన తనని త్రికరణశుద్ధిగా కోరుకొనేవారివెంటే వుంటాడు, అంటూ దేవుని తత్త్వాన్ని మనబోంట్లకు తెలిసేలా ఆవిష్కరిస్తున్నారు. ఏలికలని పిలువబడే ఈ రాజులున్నారే వీరు తమను కొలువకమానితే తారము (నాలుగు కాసులు) విదిలించరు. కాని జగములకేలికైన శ్రీహరి తనని కొలువకపోయినా అనుగ్రహిస్తాడు. (ఎంతమంది నాస్తికులు ఏలికలవటంలేదు?) మనవాళ్ళు అనుకొనే చుట్టాలు మనం దరిద్రులమైన మరుక్షణం వెనక్కిపోతారు. దేవుడు మాత్రం మనవెంటనే వుండి యెంతైనా విడువడు. మనం స్త్రీల కోసం వెంపర్లాడతాము. కాని వాళ్ళు మనము ముసలితనంతో సడలగానే రోసి (చీదరించి) నిర్లక్ష్యం చేస్తారు. కాని దేవుడు తనను కోరినవాడు ముసలియై చావురాబోతున్నా అంతరాత్మయై వెంటనే వుంటాడు. మనం అన్నదమ్ములని భ్రాంతితో వారికోసం పాటుబడితే వారు ఆస్థికోసం అలిగి విడిపోతారు. కాని మనను పుట్టించిన దేవుడు తాను మనవెంటనే వుంటాడు. మనం వారిని పలుకరించకపోతే వూరివారు మనలను మరచిపోతారు. మనము యేడనున్నా దేవుడు మరువడు. అంతేకాదు చివరిదాకా రక్షిస్తాడు. మన దుఃఖాలను తొలగిస్తాడు. మన యెదురుగా వున్నాడే ఈ శ్రీవేంకటేశుడు ఇతనేనండీ ‘దేవుడు’ అనదగ్గవాడు.

★ **జునుగుచు** – వెనుదీయుచు ★ **తుదిముట్టు** – చచ్చేదాకా

సంఖ్య : III/261 రాగం : లలిత పుట: 176

**13 ఇందరు నెఱుఁగుదు రీయర్థమే భువి**
**కందువఁ దగులుట కర్మముకొలఁది. ॥పల్లవి॥**

**ఆదికి ననాది హరిదాస్యం బిది**
**వేదాంతంబుల వెలసినది**
**సోదించి కనిరి శుకనారదాదులు**
**పాదుగఁ నిఁకఁ దమభాగ్యముకొలఁది. ॥ఇంద॥**

**అతిరహస్య మిది అచ్యుతుపై భక్తి**
**ప్రతిలేనిపరమపావనము**
**చతురులై తెలిసిరి సనకాదిమునులు**
**తతి దొరకుట సుకృతఫలముకొలఁది. ॥ఇంద॥**

**పరము శ్రీవేంకటపతిసంకీర్తన**
**సొరిది గురుఁ డొసఁగుసూక్ష్మ మిది**
**చిరపుణ్యులు మును చేకొన్ననిజ మిది**
**మరిగి మనుట తమమనసులకొలఁది ॥ఇంద॥ 261**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో గొప్ప రహస్యాన్ని చాటిచెబుతున్నారు. ఈ పుడమిలో అందరికీ తెలిసిన సంగతే ఇది. శ్రీహరిపై మనస్సు తగులుకొని వుండాలంటే అది నీ గతజన్మలలో నీవు చేసిన కర్మల కొలది సంభవిస్తుంది. అందరూ హరిభక్తులు కావాలంటే కుదరదు, మరి. ఈ హరిదాస్యమనేది, ఆదికి అనాదియైనది. వేదాంతము యొక్క సారము, ఇదేయై వెలసినది. శుకుడు, నారదుడు వంటి మహా మునులు శోధించి, తమ భాగ్యముగా కనుగొన్నది, హరినామమే. దానిని వారు తమ భాగ్యము కొలది వ్యాపింపజేశారు. అచ్యుతునిపై భక్తి అతిగోప్యమైనది. పరమపావనమై సాటిలేనిదీ హరిభక్తియే. సనక సనందనాది ఋషులు బహు చతురులైనందున ఈ హరిభక్తిని తెలిసికొని చాటిరి. మన సుకృత ఫలము కొలది మనకు దొరికినది. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటపతి సంకీర్తన పరము నొసగునది. మా గురుదేవులు మాకొసగిన సూక్ష్మమైన ముక్తి మార్గమిదే. అనంతమైన పుణ్యమును చేకొన్నవారు ఇదివరకు గ్రహించిన నిజమిదియె. అయితే హరిని మరిగి జీవించటం వారివారి మనస్సుల విభవము కొలది సాధ్యపడుతుంది.

★ **పాదుగ** – నిలకడగ ★ **సొరిది** – క్రమముగా





సంఖ్య : XV/336 రాగం : మలహరి పుట: 226

**14 పట్టరాని యాసోదము పాలువొరిగినట్టు వొంగి**
**పుట్టి పుట్టి విసిగినాఁ బోనీదు మాయ ॥పల్లవి॥**

**కన్నులెదుట నున్నవి కావలసిన వెల్లాను**
**యెన్ని గట్టుకొనఁగలఁ డీ జీవుఁడు**
**వెన్నాడి తిరిగితే విశ్వ మెల్లా మనుజులే**
**యెన్నఁగఁ జుట్టము లెవ్వ రిందు దనకు ॥పట్ట॥**

**వింత వింత రుచులై వెలసీఁ బదార్థములు**
**యెంతని వొట్టుకొనీని యీ ప్రాణి**
**మంతనానఁ దలఁచితే మనసెల్లాఁ గోరికలే**
**యంత సేసి పెనఁగఁగా నేమి నిజ మాయెను ॥పట్ట॥**

**ఆముకొని జగమెల్లా నంగజవికారములే**
**యేమని భోగించీని యీ దేహి**
**నేమపు శ్రీవేంకటేశ నీవే నాకు గతి యిఁక**
**పామర బదులవంకఁ బని యే మున్నది ॥పట్ట॥ 336**

**భావ దర్పణము :**

ఆసోదము అంటే కామము అని అర్థం. తాళ్ళపాక పెదతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తనలో యేమంటున్నారంటే, పట్టరాని కామము పాలపొంగులాగా పొంగినందువల్ల జీవిని వదలదు. ఈ జీవుడికి కావలసినవన్నీ వాడి కన్నులయెదుటనే వున్నా వొక్కటన్నా తనతోపాటు పట్టుకొని పోగలడా, పూనుకొని వెంటబడి తిరిగితే ఈ పుడమినిండా మనుజులే కదా! ఇంతమందిలో తనకు యెవ్వరు ఏ జన్మలో చుట్టాలో యెవ్వరైనా చెప్పగలరా? రకరకాలైన పదార్థాలు వింత వింత రుచులతో వుంటాయి. ఈ ప్రాణి యెన్నని తినగలడు, యెంతని తినగలడు? గూఢముగా ఆలోచిస్తే ఈ ప్రాణికి మనస్సునిండా కోరికలే. వీడు యెంత తన్నుకొన్నా ఒట్టుకొన్న వీటిలో యెన్ని నిజమవుతాయి? జగమంతా మన్మథుని వికారమే ఆక్రమించగా ఇక ఈ దేహి భోగాసక్తుడు కాక మరెట్లుండును? నియమంతో దీనరక్షకుడవైన ఓ వేంకటేశ్వరా! నీవే నాకు గతి పామరులైన, పండితులైనా నీకు ఒక్కటే తండ్రీ! నన్ను దయచూడు.

★ **ఆముకొని** – ఆక్రమించి ★ **పెనగగా** – చుట్టుకొనగా

సంఖ్య : II/3　　రాగం : సాళంగనాట　　పుట: 3

**15 దొరకె మాపాలికిఁ గందువయర్థము**
**దరిదాపైయుండినతత్త్వార్థము ॥పల్లవి॥**

**తిరముగ నల్లదీవిఁ దెచ్చినయర్థ మిదివో**
**విరజవోడరేవున వెళ్లినర్థము**
**పరమభాగవతులు పాఁతినర్థ మిదివో**
**పురుషోత్తముఁడ నేటిపురుషార్థము ॥దొర॥**

**చందపువేదముల (లు?) శాసనము వేసినర్థము**
**ముందు సుముద్రలకెల్లా మొదలర్థము**
**అందరియాత్మలనేటి అంగళ్లలోనియర్థము**
**యెందు సహస్రనామపుటెన్నికర్థము ॥దొర॥**

**కొలచి బ్రహ్మాండముల కొప్పెరలోనర్థము**
**యిల నిహపరముల కెక్కినర్థము**
**యెలమి హీనునినైన యెక్కుడుసేసేయర్థము**
**అలరి శ్రీవేంకటేశుఁడైనయర్థము ॥దొర॥ 3**

**భావ దర్పణము :**

ఇక్కడ "అర్థము" అంటే ప్రయోజనము అని అన్నమాచార్యులవారి భావన. మా పాలిట అతిశయించిన ప్రయోజనకారియై దొరికినది ఈ వేంకటరమణుడి సేవ. మాకు సన్నిహితమైన తత్త్వార్థము ఇదియేనని అంటున్నారు. స్థిరముగా 'నల్లదీవి' (జంబూద్వీపము)ని ఈ భూమండలానికి ఇచ్చిన ప్రయోజనమిదే. విరజవోడరేవున (స్వామి పుష్కరిణి ఒడ్డున) వెలసిన అర్థమిదియే. పరమభాగవతులు ప్రతిష్టించిన అర్థము ఇదే. పురుషార్థములకెల్ల మేలైనది ఈ పురుషోత్తముడే. ఛందోబద్ధమైన వేదములను శాసనముగా చేసిన అర్థమిదియే. ముందుగా వైష్ణవులందరు ధరించే మంచి ముద్రలలోని మొట్టమొదటి అర్థము ఇదియే. జీవులందరు తమ ఆత్మలనబడు అంగళలో వెలకు కొనే అర్థమిదియే. సహస్రనామ పారాయణలో యెన్నికైన అర్థము ఇదియే. తాను కొలచిన బ్రహ్మాండాలను కొప్పెరలో వుంచినట్లు తన ఉదరములో వుంచుకొన్న అర్థమిదియే. ఇహపరములను సాధించగలిగినదీ యర్థమే. హీనునైనా ఉన్నతుని చేయగలిగినదియు నీయర్థమే. శ్రీవేంకటేశ్వరుడై అలరినదీయర్థమే.

★ **కొప్పెర** – వెడల్పయిన పాత్ర ★ **చందపు** – ఛందోబద్ధమైన





సంఖ్య : XV/76　　రాగం : బౌళి　　పుట: 51

**16 గోవింద కేశవ నీకు కుయ్యో మొఱ్ఱో**
**వోవల నీపాలఁ జిక్క దోహో నామనసు ॥పల్లవి॥**

**వొకటిపైఁ గాంక్షించు వొకటిపై వేసారు**
**వొకవేళ దుర్మాన మొడిగట్టును**
**వికలుఁడై యంతలోనే విషయపు బారిఁ జిక్కు**
**అకటా యిన్నిటాఁ దుమురాయఁబొ నామనసు ॥గోవింద॥**

**తలపోసు నొకవేళ తమకించు నొకవేళ**
**వొలుకుఁగోపము చల మొకవేళ**
**కలగించు నొకవేళ గర్వించు నొకవేళ**
**పొలసి యిన్నిటా వీదిఁ బోయఁబో నా మనసూ ॥గోవింద॥**

**సంతసించు నొకవేళ జయమందు నొకవేళ**
**పంతమాడు నొకమట్టు పడినవేళ**
**యింతలో నీవు శ్రీవేంకటేశ కావకయుండితే**
**రంతుల నేమీఁ జెప్పరాదువో నామనసూ ॥గోవింద॥ 76**

**భావ దర్పణము :**

గోవింద కేశవ నీకు కుయ్యో మొఱ్ఱో అంటున్నారు పెదతిరుమలయ్య. అంటే కుయ్యోమొఱ్ఱో అని తన ఆవేదన తెలియపరుస్తున్నారన్నమాట. ఓహో! నామనస్సు నీపట్ల వోవల (చక్కగా) చిక్కినదయ్యా! అని వేడుకొంటున్నారు. నా మనస్సు యెంత విచిత్రమైనదో వివరిస్తాను కాస్త ఆలకించవయ్యా? ఒకటిపై (ఒకదానిని) అది కాంక్షిస్తే, ఒకటిపై వేసారు (ఇంకొకదానికోసం విచారిస్తుంది). ఒక్కొక్క సమయంలో చెడు నడతకు మొగ్గు చూపుతుంది. అంతలోనె వికలుడై విషయ సుఖాలకోసం వెంపర్లాడుతుంది. అయ్యో! నామనస్సు అన్ని విధాలా చిన్న చిన్నముక్కలైపోయిందే!! ఈ నామనస్సున్నదే, అది ఒకప్పుడు ఆలోచిస్తూనే వుంటుంది, ఒకప్పుడు చలించి పోతుంది. అది ఒక్కొక్కప్పుడు కోపిస్తుంది. ఒకప్పుడు పట్టుదలతో వుంటుంది. అది ఒక్కొక్కప్పుడు సంక్షోభము చెందుతుంది. అదే ఒకప్పుడు గర్వపడుతుంది. అన్ని విధాలా ఈ మనస్సు నన్ను వీధినిబడేస్తుంటుంది. ఈ నామనస్సే ఒకప్పుడు సంతోషంతో వుంటుంది, మరొకప్పుడు విజయోత్సాహంతో వుంటుంది. కుదురు కోల్పోయినప్పుడు, అది పంతము పడుతుంటుంది. ఆ శ్రీవేంకటేశ్వరుడే కావకుండా వుంటే ఈ నామనస్సు యొక్క రంతుల (ఆడించే ఆటలు) యెన్నని చెప్పను?

★ **తమకించు** – చలించిపోవు ★ **తుమురు** – చిన్నచిన్న ముక్కలగుట

సంఖ్య : III/309 రాగం : దేసాళం పుట: 209

**17** ఇంతగా మన్నించి నన్ను నేలుకొంటి విలలోన
వింతగా నెవ్వరినిఁక వేఁడఁబోయ్యేనయ్యా. ॥పల్లవి॥

కలవారిలోన నీవు గలవాఁడవని నేను
కలసి లేనివారిలో కర్మములేనివాఁడను
బలువులలో నీదాస్యబలవంతుఁడ నేను
యెలమి మాకిఁకఁ జూడ నేమిగడమయ్యా. ॥ఇంత॥

నెమ్మదిలోనివారిలో నీకుక్షిలోపలివాఁడ
నమ్మనివెలివారిలో నాస్తికుల వెలివాఁడ
పమ్మి పదస్థులలోన పరమపదమువాఁడ
ఇమ్మని నిన్నడగేది ఇఁక నేఁటిదయ్యా. ॥ఇంత॥

ధర్మపువారిలో నీదయాధర్మపువాఁడ
మర్మపువారిలో నీమాయలమర్మమువాఁడ
అర్మిలి శ్రీవేంకటేశ అంతర్యామివి నీవు
నిర్మించినవాఁడ నేను నెలకొంటినయ్యా. ॥ఇంత॥ **309**

**భావ దర్పణము :**

ఈ కీర్తనలో స్వామికి తానెటువంటివాడో చక్కగ వివరిస్తున్నారు అన్నమయ్య, స్వామీ! నాలో ఎన్ని అవగుణాలున్నప్పటికీ నన్ను ఇంతగా మన్నించి యేలుకొన్నావు. ఇక ఈ పుడమిలో నేనెవ్వరిని వేడను, వేడబోను, నీవే నా దిక్కు అంటున్నారు. ప్రభూ! నీవు కలవారిలోకెల్ల "కలిగినవాడవు". మరి నేనో లేనివారిలోకెల్ల లేనివాడను. కర్మములేనివాడనయ్యా! ఇక బలవంతుల ప్రసక్తి వస్తే, నీ దాస్యమనే బలం పుష్కలంగా వున్నవాడిని మరియే విధంగా చూచినా మాకు యేమిలోటయ్యా? స్వామీ! నా అంతనెమ్మదస్తుడు మరొకడుండడు, యెందుకంటే నేను నీ కడుపులోవున్న వాడనే కదా! నిన్ను నమ్మని నాస్తిక మూకలను నేనూ యేనాడూ నమ్మను. ఇక బాటసారులలోనేనూ బహుదూరపు బాటసారిని. నా గమ్యము పరమపదము. ఇది నీకు తెలియనిదా? నేను ప్రత్యేకించి అది నాకు ప్రసాదించుస్వామీ! అని అడుగవలెనా? ఎందరో నిన్ను యేవేవో ధర్మము చేయమంటారు, కాని నాకు నీ దయా ధర్మము చాలు ప్రభూ! కొందరు మర్మములతో కూడివుంటారు. నేను నీ మాయామర్మము తెలిసినవాడను. ఓ వేంకటేశ్వరా! ఇది నా గొప్పతనం కాదు. నీవు నా అంతర్యామివై నన్ను నిర్మించగా నేననేవాడను వున్నాను, అందుకు.

★ **అర్మిలి** – ఆపేక్షగల ★ **పమ్మి** – అతిశయించి





సంఖ్య : XV/51 రాగం : శుద్ధవసంతం పుట: 34

**18** కలకాల మెవ్వరికిఁగాఁ బాటువడెదేహి
వలలఁ బడి తుద నొకరివాఁడుఁ గాఁడాయ ॥పల్లవి॥

పాపకర్మపు మనసు పంచేంద్రియములకె
చూపిచ్చెఁ గాని దయఁ జూడ దాయ
దీపనపు టన్యాయ దేహంబు రుచులకె
వాపించె నను మొకము వడిఁ దనుప దాయ ॥కల॥

సిగ్గుమాలిన వయసు చెలుల యెంగిలిమోవి
కొగ్గించి దొరతనం బొసఁగ దాయ
నుగ్గైన యీ యాస నూరుగురిఁ గొలిపించి
తగ్గించి గర్వంబు దరిచేర్ప దాయ ॥కల॥

మాలు గలసిన బదుకు మాయలోనె కలపి
యేలకో ఘనసుఖం బియ్య దాయ
యీ లోన శ్రీవేంకటేశ్వరుఁడు నను గాచె
నాలోని పొందికలు నాకు నరుదాయా ॥కల॥ **51**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో దేహి జీవితాంతము యెవ్వరికోసం పాటుపడుతున్నాడు, అని ప్రశ్నిస్తున్నారు. ఇంతా చేసి, వలలో పడి బ్రతుకు నెట్టుకొస్తున్నవీడు చివరికి యెవ్వరి వాడూ కానేకాడాయె. వీడి (దేహి) మనస్సు వున్నదే, ఇది వీడి పంచేంద్రియాలను పాపకర్మలకే ప్రోత్సహిస్తుంది. కాని వీడిపైన రవ్వంత జాలికూడా లేదు ఆ మనస్సుకు. ఇక వీడిదేహమున్నదే అది కొత్త కొత్త రుచులపై ఆశపడుతుంది. వాటికోసం మొహమువాస్తుంది. సిగ్గుమాలిన వీడి (దేహి) యౌవనం వీడిని చెలుల యెంగిలి పెదవులకు ఆశపడేట్లు చేస్తుంది. ఇక వీడి దొరతనం వీడికి పొసగదాయె. ఇక నుగ్గు అయిపోయిన వీడు ఆశ చావక నూరుమందిని కొలిచేటట్లు చేసి, వీడి గర్వాన్ని హరించి తలెత్తుకోకుండా చేస్తుంది. మాలుగలిసిన (చెడిపోయిన) బ్రతుకును మాయకులోనుజేసి యెందుకో సుఖానికి దూరం చేస్తుంది. ఇదిట్లా వుండగా శ్రీవేంకటేశ్వరుడికి నాపై కృపగలిగి నన్ను సంరక్షించినాడు. అరుదైన పొందికలు (చేరికలు) నాకు లభించి నన్ను ధన్యుని చేసినవి.

★ **దీపనపు** – మంగళకరమైన ★ **తనుపదాయ** – తృప్తి చెందదాయెను

సంఖ్య : III/312 రాగం : గుండక్రియ పుట: 211

**19 ఇదిగా దదిగా దిన్నియు నింతే**
**పదిఁబది హరి నీపదమే నిజము. ॥పల్లవి॥**

**సురలును నసురలు చూపట్టు రాజులు**
**అరసి కనక (ఁగ?) గతమగువారె**
**సిరుల వీరిఁ గొలిచెద మంటే మతి**
**కెరలి పరుల రక్షింపఁగఁగలరా. ॥ఇది॥**

**పదునాలుగవది బ్రహ్మలోకమును**
**కదిసి నీరుమునుకలపొలము**
**చెదరక యిఁకఁ దముఁ జేరిన వారల**
**వుదుటున నిముడుక వుండఁగఁగలరా (దా?) ॥ఇది॥**

**అచ్చుతుఁడవు నీయచ్చుతపద మది**
**యిచ్చుట శ్రీవేంకటేశుఁడవు**
**చొచ్చిరి నీశరణు శుకసనకాదులు**
**మచ్చిక నిదిగని మరిగితిమయ్యా. ॥ఇది॥ 312**

**భావ దర్పణము :**

అన్నమయ్య కీర్తనల పల్లవిని వివరించటం కీర్తన వివరించటం కంటే పదిరెట్లు కఠినం. నేనిలా భావిస్తున్నాను. "ఇదిగాదు" అంటే ఈప్సితార్థములకోసం రాజులను, ధనవంతులను ఆశ్రయించడం తగదు. "అదిగాదు" అంటే ఇహపరాలకు చిల్లరదేవతలనాశ్రయించడం తగదు. ఇన్నియు ఇంతే. అల్పఫలమునే యొసగును. కాని పాదముల బడిహరీ! నీపదమునే కొలిచితే అదే నిజమైన ఆనందాన్ని ఇస్తుంది. సిరులకోసం కొంతమంది తెలివిలేక సురలను, అసురలను, భూపతులను ఆశ్రయిస్తున్నారు. ఆలోచించి చూస్తే వారే శాశ్వతం కాదుగదా! ఇక వాళ్ళు ఇతరులనేమి రక్షిస్తారు చెప్పండి? చతుర్దశ భువనాలలో పదినాలుగవది, బ్రహ్మలోకమంటారు. ఈ లోకాలకు పోయినవారికి 'మును కల పొలము' (ఇదివరకు పొందిన ప్రదేశము చెదరక వుంటుందా? వారి పుణ్యం తరిగితే వారూ తిరగక తప్పదు. ఇక వారు తమనాశ్రయించినవారికేమి పుణ్యలోకాలనిస్తారు? ప్రభూ! నీపేరే అచ్యుతుడు. నాశములేని శాశ్వతుడవు. ఈ మా భూమిమీద శ్రీవేంకటేశ్వరుడవైతివి. శుకుడు, సనకసనందనాదులే నిన్ను నేటికీ తిరుమలలో కొలుస్తున్నారు. నిన్నే శరణుజొచ్చినారు. ఇది చూచిన పిదప నిన్ను మేము వదలగలమా? నిన్నే మరిగితిమి, ప్రభూ!

★ **కెరలి** – అతిశయించి ★ **మరిగితిమి** – ఆశపడినాము





సంఖ్య : XV/397 రాగం : మధ్యమావతి పుట: 267

**20 ఏపాటివారికి నాపాటివాఁడవు**
**చేపట్టినవారిని చేకొని రక్షింతువు ॥పల్లవి॥**

**విన్నపములు సేయువారి విన్నపములు విందువు**
**సన్నుతించే వారిని సార మెంతువు**
**కన్నులఁ జూచేవారిఁ గడఁగి నీవు చూతువు**
**వున్నవారి కెల్లా నీవు వూరకే వుందువు ॥ఏపాటి॥**

**కొలిచినవారల కొలువు లీడేరింతువు**
**తలఁచినవారల దండ నుందువు**
**వలసినవారికి వరము లొసఁగుదువు**
**తెలియనివారల తెరువు నీ వొల్లవు ॥ఏపాటి॥**

**శరణు చొచ్చినవారి సరవితోఁ గాతువు**
**సరుగ నీ వారికిఁ జవ విత్తువు**
**యిరవై యలమేల్మంగ నేలిన శ్రీవేంకటేశ**
**మడుగనివారికి మట్టుతో నుండుదువు ॥ఏపాటి॥ 397**

**భావ దర్పణము :**

శ్రీహరి తత్త్వాన్ని వివరిస్తున్నారు పెదతిరుమలయ్య సులభగ్రాహ్యంగా. ఏపాటివారికి (ఎటువంటివారైతే) నీ భక్తులు, నీవూ ఆపాటి వాడవే (అటువంటివాడవే). నీవు యెవ్వని చేపట్టెదవో వారిని చేకొని (స్వీకరించి) రక్షింతువు. మోసము, ఉపేక్షా, నీవు సహించవు – అంటున్నారు. నీకు యెవ్వరైతే వినయంగా మనవి చేసికొంటావో, నీవు వారి మనవి వింటావు. నిన్ను యెవ్వరు సన్నుతిస్తారో అది త్రికరణశుద్ధి సన్నుతియా కాదా అని యెంచెదవు. ఊరకనే తిరుమలకు వచ్చి దర్శనం చేసికొంటే, నీవు చూస్తూనేవూరకుంటావు. ఆ విధముగా వున్నవారికి నీవూ వూరకే వుందువు. ప్రభూ నిన్ను కొలిచిన వారి కొలువు పండింతువు. నిన్ను తలచుకొంటూ వుండేవారికి అండదండై వుంటావు. కోరినవారికి వరములనొసంగెదవు. నిన్ను తెలియదలచని వారి తెరవు కూడా నీవు చూడవు, ఇష్టపడవు. దేవా! నిన్ను యెవ్వరు శరణంటారో వారిని సరగున (వేగముగా) కాచెదవు. వారు వర్ధిల్లుటకు జవసత్వములనిత్తువు. సుస్థిరముగా అలమేల్మంగమ్మనుయేలిన శ్రీవేంకటేశ్వరా! మడుగనివారికి (వంగనివారికి) నీవు మట్టుతో నుందువు (మితముగానే వుంటావు).

★ **తెరువు** – గత్యంతరము ★ **సరుగ** – వర్ధిల్లుటకు

సంఖ్య : II/511 రాగం : ముఖారి పుట: 345

21 అతఁడే గతియని యంటే నన్నిటా మాన్యుఁడు
ఇతరాలు మానఁగానే యీతనికే శలవు ॥పల్లవి॥

శ్రీరమణునినిత్యసేవకులకుఁ దొల్లె
వేరులేనికర్మముల వెట్టిమాన్యము
ఆరీతి నితనిభక్తులైన చనవరులకు
ఆరితేరి పుణ్యపాపా లడ్డపాటు లేదు ॥అతఁ॥

తక్కక యితనిముద్ర ధరించినదాసులకు
చొక్కుల భవబంధాలసుంక మాన్యము
లెక్కించ నితనికైనలెంకలకు బొడుకల -
కొక్కట విధనిషేధా లూహింప లేవు ॥అతఁ॥

సరుస శ్రీవేంకటేశుశరణాగతులకును
పరగ మాయలదొడ్డిబందె మాన్యము
పరమమైనయితనిపళ్లెముకూటివారికి
ధరలో నేమిటివంకాఁ దప్పులే లేవు ॥అతఁ॥ 511

**భావ దర్పణము :**

అన్నమయ్య యేమంటున్నారంటే ఈ దేవదేవుడే అన్నిటా (అన్నివేళలా) గతియనియంటే (అట్లా శరణుజొచ్చినవాడే) మాన్యుడు (గౌరవనీయుడు). ఇతరములైనవి విడిచిపెట్టగానే ఆ శరణాగతులు ఈ స్వామికే శె(సె)లవు (ఆజ్ఞావర్తను) లవుతారు. శ్రీరమణుని నిత్యము సేవించువారలకు సాటిలేని కర్మములవెట్టి (బండ అనుభవము) వుండదు. ఆ రీతిగా ఇతని భక్తులైన స్వామి ఆత్మీయులకు, దిట్టమైన పాపపుణ్యముల అడ్డంకి వుండదు. వెనుదీయక ఈ శ్రీహరి ముద్రలైన శంఖ చక్రములు, తిరునామము ధరించిన హరి దాసులకు, భవబంధాలు సుంకము గౌరవముగా చెల్లించుటకు వీలవుతుంది. ఇతని వారలైన లెంకలకు (శిష్యులకు) బొడుకలకు (పిల్లలకు) ఒకటే విధమైన శిక్షలు నిషిద్ధము. అట్లా ఊహించుటకు కూడా నిషేధమే. సరసుడైన శ్రీవేంకటేశుని శరణాగతులకు ఆయన మాయలయొక్క దొడ్డి బంధనము వుండదు. పరమపదకాంక్షులైన ఈతని దాసుల పంక్తి భోజనములలో పళ్ళెముకూడు భుజించు వారికి ధరణిలో యెట్టి దోషమూ వుండదు. వారు తప్పు అనునదే చేయరు.

★ **పళ్ళెముకూడు** – సిద్ధాన్నము ★ **వంక** – దోషము





సంఖ్య : XV/103 రాగం : గుజ్జరి పుట: 69

22 ఇటువంటి దుర్గుణి నన్నెట్టు గాచితవో గాని
సటలాడేవానికి సత్యమెందు లేదు ॥పల్లవి॥

మదనాతురునికిని మరి వివేకము లేదు
కదిసి అలసునికి కర్మము లేదు
పొదిగి యాశకునిఁకే పుణ్యపాపము లేదు
మొదలనె మూర్ఖునకు మొగ మోఁట లేదు ॥ఇటు॥

కొంచెపు నాస్తికునికి గురుఁడు దైవము లేఁడు
పొంచిన లోభివానికి భోగమే లేదు
యించుకంత దరిద్రున కియ్యాఁ గొన శక్తి లేదు
చంచల చిత్తునికి నిశ్చయ మెందు లేదు ॥ఇటు॥

మత్తుఁడైనవానికి మరి పనులే లేవు
హత్తి వేఁటకానికి దయలు లేవు
సత్తుగ శ్రీ వేంకటేశ శరణాగతుఁడ నీకు
యిత్తలఁ దొల్లిటి చింత లిఁక నేమి లేవు ॥ఇటు॥ 103

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో ఆత్మనింద చేసికొంటూ యేమంటున్నారో ఆలకించండి. దేవా! సటలాడేవానికి (కపటికి) సత్యముమీద నమ్మకముంటుందా? అన్నీ దుర్గుణాలే వున్న నన్ను నీవు యెట్లా రక్షించావో నాకే ఆశ్చర్యంగా వున్నది. ప్రభూ! నీకు తెలియనిదేమున్నది? మన్మథ జ్వరపీడితునకు వివేకముంటుందా, లేనే లేదు. అలసత్వముగలవానికి సత్కర్మలపై కోరికే లేదు. చుట్టుకొని ఆశాపీడితునకు పుణ్యమనేదే లేదు. మొదటినుంచి మూర్ఖుడైన వానికి మొగమాటమనేదేవుండదు, కదా! స్వామీ! సంకుచిత భావాలు గల నాస్తికునికి గురువుపై దైవముపై నమ్మకము వుంటుందా? లోభియైనవాడు తాను సుఖపడడు పరులను సుఖపెట్టడు. దరిద్రపీడితునకు అంగీకరించే శక్తి వుండదు. చంచల స్వభావుడు యే నిశ్చయానికీ రాలేడు, కదా! ప్రభూ! ఎప్పుడు మత్తులో వుండేవాడు యేపనీ చేయలేడు. వేటగానికి దయ అనేదేది వుండనే వుండదు. సత్యప్రమాణముగా ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ శరణాగతుడను. నాకు పూర్వకర్మలుగాని, ఆలోచనలుగాని లేనేలేవు. చింత అనేదే లేదు.

★ **ఇయ్యాఁగొన** – అంగీకరించు ★ **పొదిగి** – చుట్టుకొని

సంఖ్య : II/506    రాగం : వరాళి    పుట: 342

**23 వెదకనేఁటికి నేయి వెన్న చేతఁ బట్టుకొని**
**మొదలఁ గలిగితేనే ముందరాఁ గలుగుట ॥పల్లవి॥**

**తనపూర్వభావము తలఁచి మరవకుంటే**
**పనివడి తనపుణ్యఫల మబ్బుట**
**మనవార్తి నానాఁటిమాయ చూపెట్టుకుండితే**
**జనించినతనకు విజ్ఞానసిద్ధి యగుట ॥వెద॥**

**పుట్టినయప్పటితనభోగముఁ దలఁచుకొంటే**
**కొట్టఁగొన తనకోర్కి కొనసాగుట**
**నట్టనడిమిజగమునటనఁ దెలుసుకొంటే**
**గుట్టుతోడిగురుబోధగురుతు చేచిక్కుట ॥వెద॥**

**జీవకళ నంటినట్టిచిక్కు విదిలించుకొంటే**
**దేవుఁడు తనచేఁ జిక్కి తిరమౌట**
**శ్రీవేంకటేశుఁ డీతనిఁ జేరి శరణంటేను లలలల**
**ఆవలనీవలఁ దాను అన్నిటా గెలుచుట ॥వెద॥ 506**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన ఏమాత్రం సులభగ్రాహ్యం కాదు. నేను చెబుతున్నది స్వామి నాకు స్ఫురింపజేసిన భావము. మొదలుగలిగితేనే (మనకు పూర్వజన్మ సుకృతం వుంటేనే) ముందు కలుగుట (మనకు ఈ జన్మలో మంచి జరుగుతుంది.) ఎవడికైన చేతిలో వెన్న వుంటేవాడు నెయ్యి కావాలని పరులను అడుగుతాడా? తన పూర్వజన్మలో చేసిన పుణ్యంవుంటేనే, దాని ఫలము అబ్బుతుంది. ఆర్తిగలవారి మనవి విని వారిపై తన మాయలు చూపించకుండావుంటేనే తనకు మంచిజ్ఞాన సిద్ధి మరుసటి జన్మలో కలుగుతుంది. అప్పుడు మాయలమారివాళ్ళు ఇప్పుడు మూఢులు అవక తప్పదు. తను పుట్టిననాటి భోగములను తలచుకొని మంచి చేయకుంటే తన చిట్టచివరి జీవితంలో మేలు జరుగుతుందని చెప్పలేము. కనీసం నట్టనడిమి జీవితంలోనైన ప్రపంచం అంటే యేమిటో తెలిసికొంటేనే సద్గురువుబోధ చేజిక్కుతుంది. లేకపోతే అజ్ఞానిగానే జీవితం అస్తమిస్తుంది. జీవుడికి అబ్బునట్టి కళలనన్నింటిని అర్థం చేసికొని వాటిని విదిలించుకొంటేనే దేవుడు స్థిరముగ తనకు చేజిక్కుతాడు. జీవులు శ్రీ వేంకటేశ్వరుని చేరి శరణంటేనేగాని తాను ఆవలన్ యీవలన్ (పరములోగాని ఇహములోగాని) తాను అన్నిటా గెలుచుట సాధ్యము కాదు.

★ **తిరమౌట** – స్థిరపడుట ★ **గుట్టుతో** – ఏకాంతముగా





సంఖ్య : XV/75    రాగం : లలిత    పుట: 50

**24 ఇంతే మరేమి లేదు యిందుమీఁదను**
**దొంతులకర్మములెల్ల దుమ్ము దూరుపెత్తుటా ॥పల్లవి॥**

**వుల్లములోఁ బాయకయుండి రక్షించే హరి**
**నొల్లకుండుట తన్నుఁ దా నొల్లకుండుట**
**బల్లిదుఁ డాతని మాని పరుల వేఁడే దెల్లా**
**పొల్లకట్టు దంచి దంచి పోగువేసుకొనుట ॥ఇంతే॥**

**యియ్యెడఁ బుణ్యపాపములే మిగిలిన హరి**
**కియ్యకుండుటది దైవమియ్య కుండుట**
**చెయ్యార నాతని కొప్పుసేయని భోగములెల్ల**
**చయ్యనఁ జెఱకుపిప్పి చవిగొనుటా ॥ఇంతే॥**

**శ్రీకాంతుఁడైనట్టి శ్రీ వేంకటేశ్వరునిఁ**
**జేకొంటే సిరులెల్లాఁ జేకొనుట**
**జేకొని హరినామమె నుడుగుచు భక్తిఁ**
**గైకొనుట అమృతము గైకొనుటా ॥ఇంతే॥ 75**

**భావ దర్పణము :**

పెదతిరుమలాచార్యులవారి తత్త్వబోధనాకర్ణించండి. కర్మలనుండి విముక్తి 'హరి' కలిగిస్తాడు. ఓ మానవుడా! ఇంతకంటే మరేమీ లేదు. ఇక పైన దొంతుల కర్మములన్నీ (వరుసలోనున్న కర్మలు) దుమ్ము దూరుపుయెత్తుటా (దుమ్ముకొట్టుకొనిపోతాయి). కాని మీరు శ్రీకాంతునే శరణు అనాలి. మీ మనస్సులో వదలక నిలిచి రక్షించే శ్రీహరినంగీకరించకపోవటం తనని తానంగీకరించకపోవటంతో సమానము. సర్వశక్తిమంతుడైన హరిని కాదని, పరులను వేడుకొనుట... పొల్లకట్లు (తూర్పారపట్టిన మంచి ధాన్యంతో విడదీయబడిన వ్యర్థ ధాన్యం) గ్రహించి బాగుగా దంచి పోగు చేయడం వంటిది. ఎప్పుడైన మన పాపపుణ్యాల ఫలమును శ్రీహరికే అర్పించాలి. అట్లా చేయకపోతే మనం దైవాన్ని అంగీకరించని నాస్తికులమే. మనం యే భోగమైనా అనుభవించబోయేముందు చెయ్యారా (స్వహస్తాలతో) శ్రీహరికి కైంకర్యం చేయకపోతే, ఆ భోగముననుభవించుట చెఱకు పిప్పిని చవిగొనుట వంటిది. శ్రీవల్లభుడైన శ్రీవేంకటేశ్వరుని చేకొంటే సిరిని చేకొనినట్లే కదా! భక్తితో హరినామము పలుకుచు శ్రీహరిని స్వీకరించుట సాక్షాత్తు అమృతం తీసికొనుటవంటిదే.

★ **చయ్యన** – శీఘ్రముగా ★ **నుడుగుచు** – పలుకుచు

సంఖ్య : II/510 రాగం : లలిత పుట: 345

**25** ఎన్నఁడు గలుగు మరి యీభాగ్యము
సన్నిధాయ నితనికి శరణనరే ॥పల్లవి॥

అదె చంద్రుఁ డుదఇంచె నచ్చుతుఁడు జనిఇంచె
అదనఁ గంసునిజన్మ మస్తమించెను
పొదలిరి దివిజులు పొలిసిరి రాక్షసులు
సదర మీశిశువుకు శరణనరే ॥ఎన్నఁ॥

పాండవకులము హెచ్చె బాలకృష్ణుఁ డిదె వచ్చె
చండిదుర్యోధనుమూఁక జల్లన విచ్చె
దండి గోకులము నిండె ద్రౌపదితపము పండె
చండప్రతాపున కిట్టె శరణనరే ॥ఎన్నఁ॥

రేపల్లె పుణ్యము సేసె శ్రీవేంకటేశుఁడు డాసె
గోపికలమనసుల కొఱత వాసె
కోపులధర్మము దక్కె గోవర్ధనగిరి నిక్కె
చాపలమేఁటి కితని శరణనరే ॥ఎన్నఁ॥ **510**

**భావ దర్పణము :**

అన్నమయ్య శ్రీకృష్ణావతార ఆవిర్భవాన్ని వర్ణిస్తున్నారు. ఇటువంటి కీర్తనలు ఇదివరలో యెన్నోవిన్నా దేని మాధుర్యం దానిదే. మళ్ళీ ఈ భాగ్యము (శిశువైన పరమాత్మను దర్శించుట) యెన్నడు కలుగుతుందో... ఇతని సన్నిధాయెగదా! వెంటనే శరణనరో!! అదిగో చూచినారా, చంద్రుడుదయించినాడు. అచ్యుతుడు జన్మించినాడు. ఇక కంసుడి జన్మ అస్తమించింది. దేవతలు పొంగిపోయారు. రాక్షసులు క్రుంగిపోయారు. సత్వరమే ఈ శిశువుకు శరణు అని వేడుకోండయ్యా! ఇకపై పాండవకులము హెచ్చె (అతిశయించినది). యెందుకంటే బాలకృష్ణుడు వచ్చాడు కదా! దుర్యోధనుడి మూక అంతా జల్లుమని విచ్చుకొన్నది. గోకులమంతా దండిగా నిండినది. ద్రౌపది తపస్సు పండినది. ఇతగాడెవరనుకొన్నారు? చండప్రతాపముగల దేవదేవుడు. సత్వరమే శరణనండి. రేపల్లె పుణ్యం చేసింది. శ్రీవేంకటేశుని ఆశయైన గోపికల మనస్సులలోని కొఱత తీరింది, కోపులధర్మము దక్కింది. గోవర్ధనగిరి గర్వంతో నిక్కింది. అయ్యలారా! ఇంకా చాపల్యమెందుకయ్యా? వెంటనే శరణు అని మొక్కండి.

★ **కోపుల ధర్మము** – గొప్ప ధర్మము ★ **పొలిసిరి** – మరణించిరి





సంఖ్య : XV/325 రాగం : సామంతం పుట: 219

**26** పట్టరాని సంసారము బయలువందిలి యిది
మట్టుతో నీ జీవుఁ డెట్టు మాయ గడచీని ॥పల్లవి॥

నేతిబీరకాయ నెట్టనఁ గర్మబంధము
బూతుచిల్లినేస్త మెప్పుడు మనసు
ఱాతితో గిలిగింత యాఱడిసతుల పొందులు
యేతులను యీ జీవుఁ డెట్టు వేఁగించీని ॥పట్ట॥

గొంగడిఁ గట్టిన చద్ది గుతిలేని భోగము
బంగారు గట్టిన పాఁత పాయని యాస
అంగడిగట్టిన యద్ద మూగడమైన బదుకు
పొంగుచు నీ జీవుఁ డెట్టు బుద్ధి యెటిఁగీని ॥పట్ట॥

పున్నిమవెన్నెల పోగు పోలించరానిసంపద
వన్నె నద్దినట్టి బాయ వలపురతి
యిన్నిటా శ్రీవేంకటేశుఁ దేలెఁ గాక యిన్నాళ్ళు
మిన్నక యీఁ జీవుఁ డెట్టు మేర దెలిసీని ॥పట్ట॥ **325**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ వైరాగ్య కీర్తనలో నేటి “తెలుగు” వారికి తలాతోకా తెలియని మాటలు పుష్కలంగా వున్నాయి. వాటిని సమన్వయం చేసికొంటేనేగాని ఈ కీర్తన వివరించ సాధ్యం కాదు. నా ప్రయత్నం నేను చేస్తున్నాను. ప్రజలారా! ఈ సంసారమున్నది చూశారా, ఇది పట్టరానిది. దీన్ని సాధించాలనుకోవడం, బయలువంది (అసాధ్యం). జీవుడు దీని మాయను యెట్లు దాటగలడో అర్థముకాదు. వీడికి ‘కర్మ’ వలన ప్రాప్తించినవన్నీ నేతిబీరకాయ సంబంధాలు, నిరుపయోగమైనవి. వీడి మనస్సు , బూతుచిల్లి నేస్తము (ఎప్పుడూ కామ ప్రేరకమే). వీడిని ఆరడిబెట్టే స్త్రీ పొందులు రాతితో చక్కిలిగింత పెట్టడం వంటిదే. వీటితో ఈ జీవుడెట్లా వేగుతాడో తెలియదు. ఒక పద్ధతిలేని భోగము గొంగళిలో కట్టి తీసికెళుతున్న చద్దిలాంటిది. ఈ జీవుడి ఆశ విడువనిది. అది యెప్పుడూ బంగారు పాతర దొరుకుతుందేమోనని ఆశపడుతూనే వుంటుంది. నియంత్రణలేని బ్రతుకు అంగడిలో వ్రేలాడకట్టిన అద్దం లాంటిది. ప్రతివాడూ వాడుకొంటాడు, దాన్ని. పొంగిపోయే ఈ మనస్సు బుద్ధినెలా తెచ్చుకొంటుందో కదా! ఈ జీవుడు గడించే సంపద పోలించరానిది (పోల్చలేనిది). ఇది పున్నమివెన్నెలలాగ ఒకనాటి వైభవము. వలపులు గుభాళించే రతి రంగులు అద్దిన యౌవన ప్రేరితము. యౌవనం పోగానే వలపూ ఇగిరిపోతుంది. ఈ విధముగా శ్రీవేంకటేశుడు ఈ జీవుని యేలుటకు నిశ్చయించగానే వానికి మేరతెలిసీని (సరియైన దారి తెలుస్తుంది).

★ **ఏతుల** – గర్విష్టి ★ **మిన్నక** – ఊరక

సంఖ్య : II/153 రాగం : సాళంగం పుట: 103

**27 ఉన్నమంత్రా లిందుసరా వొగి విచారించుకొంటే**
**విన్నకన్నవారికెల్ల విష్ణునామమంత్రము ॥పల్లవి॥**

**పరగఁ బుచ్చకాయలఁ బరసిపోదు మంత్రము**
**గరిమ ముట్టంటులేనిఘనమంత్రము**
**వరుస నెవ్వరువిన్నా వాఁడిచెడనిమంత్రము**
**అరయ నిదొక్క టేపో హరినామమంత్రము ॥ఉన్న॥**

**యేజాతినోరికైన నెంగిలిలేనిమంత్రము**
**వోజదప్పితేఁ జెడకవుండేమంత్రము**
**తేజాన నొకరి కిస్తేఁ దీరిపోనిమంత్రము**
**సాజమైన దిదేపో సత్యమైనమంత్రము ॥ఉన్న॥**

**యిహముఁ బరముఁ దానే యియ్యఁజాలినమంత్రము**
**సహజమై వేదాలసారమంత్రము**
**బహునారదాదులెల్ల పాటవాడినమంత్రము**
**విహితమయినశ్రీ వేంకటేశుమంత్రము ॥ఉన్న॥ 153**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో విష్ణునామమంత్ర ప్రాశస్త్యాన్ని వివరిస్తున్నారు. ఈ ప్రపంచంలోవున్న మంత్రాలన్నీ ఈ మంత్రంతో (హరినామమంత్రము) సరితూగుతాయా అని ప్రశ్నిస్తున్నారు. విచారిస్తే వినేవారికీ చూచేవారికీ విష్ణునామమంత్రము వంటి మంత్రము లేదని అవగతమవుతుంది. ఈ మంత్రము పుచ్చకాయలాగ కుళ్ళి చెడిపోదు. ముట్టుట చేత అంటుగాని ఘనమైన మంత్రమిది. ఎంతమంది వరుసగా వినినా వాడి చెడని మంత్రమిది. ఇదొక్కటే హరినామమంత్రము. దీనికి సాటిలేనే లేదు. ఏజాతివానినుంచి వినినా యెంగిలి నోటిద్వారా అంటే ప్రశ్నే లేదు. ఓజతప్పితే (నేర్పు లేకపోయినా) చెడు చేయని మంత్రము ఇదే. ఒకరికిచ్చినా నీకు తక్కువకానిదీమంత్రమే. సత్యమైనదీ సహజమైనదీ ఇదేపో. ఈ హరినామ మంత్రమునకు సాటి వేరొకటి లేదు. మానవులకు ఇహమునందు శుభకరము, పరము నందు మోక్షప్రదము ఈ హరినామమంత్రము. సహజసిద్ధమైన వేదములసారమీ మంత్రమే. నారదాది మునులు గానము చేసిన మేటి మంత్రమిదే. విహితమైనది ఈ శ్రీవేంకటేశ్వరుని నామమంత్రము.

★ **సాజమైన** – సహజమైన ★ **పరసిపోవుట** – నశించిపోవుట





సంఖ్య : XV/157 రాగం : మలహరి పుట: 104

**28 వాదము లేఁటికి వలసిన వారికి**
**వేదము గలుగఁగ వెల్లివిరాయ ॥పల్లవి॥**

**దైవం బొకఁడె తత్త్వజ్ఞానికి**
**భావింపఁ బలువురు భ్రాంతునికి**
**వేవేలకు మరి విత్తు వొక్కటే ఆది**
**కావఁగఁ బూవఁగ ఘనమైనట్లు ॥వాదము॥**

**భువి సాకారము పూర్ణజ్ఞానికి**
**ఆవల నిరవయవ మధమునికి**
**అవళు గలిగికా అష్టపుత్రులును**
**భవములు శ్రీహరిపాలనె కలిగె ॥వాదము॥**

**శరణాగతియే శాస్త్రజ్ఞానికి**
**సరవిఁ గర్మమె జడునికిని**
**నిరతి శ్రీవేంకటనిలయు మాయ లివి**
**యిర వెఱుఁగు వారి కిహమే పరము ॥వాదము॥ 157**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య యేమంటున్నారో ఆలకించండి. ఎవరికి పరిపూర్ణ జ్ఞానం కావాలో, శ్రీహరికృప కావాలో శరణాగతి కావాలో వారికి వాదములతో పనియేమి. వేదములు భగవంతుని తత్త్వమును యెన్నడో వెల్లివిరౌనట్లు చేసినవి కదా! (ప్రకటితము చేశాయి కదా!) ఇంకా సందేహములెందుకు? తత్త్వజ్ఞానము తెలిసినవానికి దైవమొక్కడే. అదే పరమాత్మ. భ్రాంతి కలిగినవానికి పలువురు (ముక్కోటి దేవతలు). కాచి, పూచి వర్ధిల్లిన మహావృక్షం జనించినది, ఒక చిన్న "విత్తు" నుంచే కదా! అట్లాగే యావత్ ప్రపంచం వచ్చింది పరమాత్మనుంచే. పూర్ణజ్ఞానియైనవాడు భువిలో పరమాత్మను సాకారం గానే దర్శించగలడు. అధముడు తన కనులకు కనిపించనిదేదీ లేనేలేదంటాడు. ఒకడికి అష్టపుత్రులు కలుగుతారు. కారణం వాడికి ఋణము వున్నది. ఋణమున్నవారందరికీ సత్సాంతనము కలుగుటలేదే. ఎందుకని? సత్సంతానం కలుగవలెనంటే శ్రీహరికృప వుండితీరాలి. అందుకే శాస్త్రజ్ఞానం తెలిసినవాడు శరణాగతియే ముక్తికి సులభమార్గమని గ్రహిస్తాడు. జడుడైనవాడు గర్వముతోనే నశిస్తాడు. ఇదంతా శ్రీవేంకటేశ్వరుడు కల్పించిన మాయల ఫలితమే. హరిపై సుస్థిర భక్తి నెలకొనినవారికి ఇహమే పరము (వారు జీవన్ముక్తులు).

★ **సరవి** – క్రమముగా ★ **భవములు** – పుట్టుకలు

సంఖ్య : III/358 రాగం : దేవగాంధారి పుట: 242

**29** పంటలభాగ్యులు వీరా బహువ్యవసాయులు
అంటిముట్టి యిట్లఁ గాపాడుదురు ఘనులు. ॥పల్లవి॥

పొత్తుల పాపమనేటిపోడు నఱకివేసి
చిత్తమనియెడుచేను చేనుగా దున్ని
మత్తిలి శాంతమనేమంచి వానపదనున
విత్తుదురు హరిభక్తి వివేకులు ॥పంట॥

కామక్రోధాదులనేకలుపు దవ్వివేసి
వేమరువైరాగ్యమనే వెలుఁగు వెట్టి
దోమటి నాచారవిధుల యెరువులువేసి
వోముచున్నారు జ్ఞానపుఁబై రుద్యోగజనులు. ॥పంట॥

యెందు చూచిన శ్రీవేంకటేశుఁ డున్నాఁడని యెడి-
అందినచేనిపంటలనుభవించి
సందడించి తమవంటిశరణాగతులుఁ దాము
గొంది నిముడుకొందురు గురుకృప జనులు. ॥పంట॥ **359**

**భావ దర్పణము :**

భక్తిని మోక్షసాధనాయత్నాన్నీ వ్యవసాయంతో పోలుస్తున్నారు అన్నమయ్య. ప్రతిపదార్థ వివరణ క్లిష్టం అయినప్పటికీ అత్యద్భుతమైన కీర్తన ఇది. పల్లవిలో వీరు బహుపంటల భాగ్యమునసుభవించే వ్యవసాయదారులు. ఈ ఘనులు అంటిముట్టి (ప్రయత్నముతో) ఆ పంటను కాపాడుచుందురు – అంటున్నారు. ముందుగా ఈ వ్యవసాయదారులు పాపము అనే పోడు (ఇదివరకటి పైరు యొక్క వేళ్ళున్న నేల) లోని వేళ్ళను నఱకివేసి, చిత్తము అనే చేనును బాగుగా దున్ని, శాంతము అనే మంచి వానలో ఆ పొలం తడియగా, వివేకమున్నవారు హరిభక్తి అనే విత్తనములను బాగుగా నాటెదరు. ఇంతలో కామక్రోధములవంటి ఆరురకములైన కలుపుమొక్కలు కూడా పైరుతోపాటు మొలకలెత్తుతాయి. వాటిని తవ్వివేసి తీసేయాలి. ఆ పైరుకి వైరాగ్యము అనే మంచి వెలుగు తగలాలి. దోమటి ఆచారవిధమున (మొరటు ఆచారముగా), పెంటవంటి యెరువులను ఆ పొలములో వేయాలి. అప్పుడు జ్ఞానమనే పైరు బాగుగా పండుతుంది. అందిన చేనిపంటయే శ్రీవేంకటేశుడు వున్నాడనునట్టి జ్ఞానము. దానిని బాగుగా అనుభవించి, సంరంభముతో గురుకృప కలిగిన వారు మాబోటి శరణాగతులను తమ అండలో వుంచుకొని మోక్షమార్గమును బోధింతురు.

★ **గొందినిముడుకొని** – మూలలో వుంచుకొని ★ **ఓముచున్నారు** – రక్షించుచున్నారు





సంఖ్య : XV/316 రాగం : గుజ్జరి పుట: 123

**30** ఎక్కడి వుపాయముల నే మున్నది
మొక్కె నీ కొక్కనికే మూలము నీవే ॥పల్లవి॥

పరులను శిక్షించి పనిగొనియెద నా
సిరుల నా శరీరము శిక్షించ లేను
వరుస లోకమింతాను వసముచేసుకొనేనా
పరగ నా మతి స్వస్థపరచుకో లేను ॥ఎక్కడి॥

నిక్కము నన్యదేహము నే ననుభవించేనా
పక్కన నా యాత్మ ననుభవించ లేను
అక్కడా నిక్కడా ధన మడిగి కూడపెట్టెనా
అక్కటా నా విజ్ఞాన మార్జించ లేను ॥ఎక్కడి॥

బట్టబాయిట నే దేవపట్టములు సాధించేనా
యిట్టి తపోరాజ్య మేలఁగ లేను
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
పుట్టుగు లందేనా నీపై బుద్ధి మాన లేను ॥ఎక్కడి॥ **316**

**భావ దర్పణము :**

అనాదిగా మానవుడు తన భృత్యులను తన ధన సంపదలను నియంత్రించగలుగుతున్నాడేగాని, ప్రయత్నించి తన శరీరాన్ని మనస్సును, ఆత్మను, తపస్సును అదుపులో వుంచలేకపోతున్నాడు. ఏ వుపాయము చేబూనినా, యేమున్నది? మూలకారణమైన నీకు (పరమాత్మకు) ఒక్కనికి మొక్కితే చాలదా, అంటున్నారు పెదతిరుమలాచార్యులు. నేను నా అధికారదర్పంతో పరులను శిక్షించాలని చూస్తానే కాని, నామాటవినని నా శరీరాన్ని యేమీ చేయలేకున్నాను. ఈ లోకాన్నంతా వశము చేసికొనవలెనని చూస్తానేకాని, నా మనస్సును స్వస్థపరచి వశము చేసికొనలేకున్నాను. పరస్త్రీల దేహములననుభవించగలుగుదునే కాని నాలోనే వున్న నా ఆత్మను అనుభవించలేకున్నాను. వాళ్ళ దగ్గర వీళ్ళ దగ్గర నుంచి ధనమును అడిగి కూడబెడుతున్నానేకాని, పరులనుంచి మేలైన విజ్ఞానమును ఆర్జించలేకున్నాను. యక్షరాక్షసుల అనుగ్రహం సంపాదించి వారి నివాసస్థానములను పొందాలని ప్రయత్నిస్తున్నానే కాని గట్టి తపస్సుచేసి తపోరాజ్యమును తద్వారా భగవత్కృపను, నేను సాధించలేకున్నాను. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నా యెట్టయెదుటనే నిలిచి నన్ను రక్షించుచుంటివి. ఎన్నిజన్మలెత్తినా నీపై నా బుద్ధిని మానలేకున్నాను.

★ **దేవపట్టము** – యక్షరాక్షసులచోటు ★ **పనిగొనియెద** – పూనుకొందును

సంఖ్య : III/310    రాగం : గుండక్రియ    పుట: 209

**31 అందాఁకా వైష్ణవ మటక(మ)టకే**
**నిందకుఁబాసిన నిర్మలుఁడగును. ॥పల్లవి॥**

**పాపపురాసులు పరిహారమైతే**
**దీపించుహరిభక్తి వొడమును**
**చేపట్టి పుణ్యము చేరువలయితే**
**శ్రీపతిదాసులసేవే దొరకు. ॥అందాఁ॥**

**కొట్టఁగొనకు మతి గోరి పారితే**
**జట్టిగ హరికథ చవిగలుగు**
**పట్టినజన్మము పావనమైతే**
**మట్టులేని తిరుమంత్రము దొరకు. ॥అందాఁ॥**

**గురుకటాక్ష మొకకొంత సోఁకితే**
**శరణాగతి నిశ్చలమవును**
**యిరవుగ శ్రీవేంకటేశ్వరుఁ గొలిచితే**
**పరమపదమునకుఁ బాత్రుండవును ॥అందాఁ॥ 310**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన పల్లవిలో అచ్చుతప్పు దొర్లిందని నా భావన. 'అటకట' అనే పదము కానరాదు. 'అటమట' అనే పదమువుంది కాని దాని అర్థము 'వంచన' అని. అప్పుడు ఈ పల్లవిని ఇలా భావించవచ్చును. వైష్ణవమును అందుకొన్నాక సాధకుడు, యెట్టి వంచనకు నిందలకు దూరమై నిర్మలుడగును. మానవులు చేసిన పాపములు పరిహరింపబడితేనే కాని వారికి హరిభక్తి కలుగదు. శ్రీపతిదాసులు యెదురుపడినా వారిని పలుకరించము. అదే మనకు పుణ్యప్రాప్తి కలుగగానే వారిని సేవించాలనిపించి వారి సేవాభాగ్యము కలుగుతుంది. మనస్సు చివరి దాకా పరుగులిడినా శ్రీహరి కృప వుంటేనే హరికథాశ్రమణంపై మక్కువ కలుగుతుంది. కలిగిన జన్మ పావనమయ్యే యోగం వుంటేనే పవిత్రమైన అష్టాక్షరీమంత్రము దొరుకుతుంది. లేకపోతే జన్మంతా వ్యర్థమే. గురువు కటాక్షము సోకితేనే శరణాగతి నిశ్చలమవుతుంది. స్థిరముగా శ్రీవేంకటేశ్వరుని కొలిచితేనే జీవుడు పరమపదమునకు పాత్రుడౌతాడు.

★ **మట్టులేని** – దోషరహితమైన ★ **ఒడమును** – కలుగుతుంది



హరినే అడుగరో ఆమాట

సంఖ్య : XV/337   రాగం : నాట    పుట: 227

**32 ని న్నడిగే నాన తీవే నే నీ పుట్టుగులకు**
**పన్నుకొన్న నేరమి నాపై నెట్టు గలిగె ॥పల్లవి॥**

**పూర్వపు నీవు పురాణపురుషుఁడవు గనక**
**వుర్విపై నీ వెఱుఁగని దొకటి లేదు**
**పర్విన కోటిసూర్యప్రకాశుఁడవు గనక**
**సర్వజ్ఞ నీవు గానని చంద మేమీ లేదు ॥నిన్న॥**

**వినుతించ నీవు వేదవేద్యుఁడవు గనక**
**మనసులో నీ కెక్కడ మఱపు లేదు**
**అనిశము నీవు సర్వవ్యాపకుఁడవు గనక**
**యెనయఁగ నీకు విరహిత మెందూ లేదు ॥నిన్న॥**

**పొంత నీవు పంచమహాభూతేశుఁడవు గనక**
**పంతాన నీవు లేని ప్రపంచము లేదు**
**అంతర్యామివి శ్రీవేంకటాధిపతివి గనక**
**చింతాకంత నీవు లేని చేష్ట లేడా లేవు ॥నిన్న॥ 337**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఏడుకొండల తిరుమలయ్యను సూటిగా ప్రశ్నిస్తున్నారు. నిన్నడుగుతున్నాను, ఆనతియ్యి స్వామీ! ఈ నాపుట్టుగులకు నేరము నాపై యెట్లా వేస్తావు? నీవు పురాణ పురుషుడవు, నీకు తెలియకుండా యేమి జరుగుతుంది? ఎందుకు నాకీ అగచాట్లు? ప్రభూ! నీవు యెఱుగనిది ఈలోకంలో వుంటుందా? నీవు ఆదిపురుషుడవు కదా! నీవు విస్తరించిన కోటి సూర్యతేజోరాశివి, సర్వజ్ఞా! నీవు కనలేనిదేముంటుంది? నీనుంచి యేది దాచగలము? నీవు వేదములచే వినుతించబడి వేదములచేతనే తెలియబడెడివాడవు. అంత ధారణా శక్తిగలనీవు మనస్సులో అన్నీ మరువక దాచికొని యుందువు. నిరంతరమూ నీవు సర్వవ్యాపకుడవుగనుక నీవు లేనిదేదీ ఈ సృష్టిలో లేదు. స్వామీ! నీవు నీ వునికిని భూమి, నీరు, వెలుగు, గాలి, ఆకాశము అను పంచభూతముద్వారా చాటుచున్నావు. ఈ ప్రపంచంలో అందుచేత నీవు లేనిదేదియునూ లేదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు సమస్త జీవులలో అంతర్యామివలెనుందువు. 'చింతాకు' పరిమాణములో నీవులేని 'చేత' యేదీ లేనేలేదు.

★ **పర్విన** – వ్యాపించిన ★ **విరహితము** – లేనిది

సంఖ్య : II/487 రాగం : మాళవిగౌళ పుట: 328

**33 వీదులవీదులనెల్లా విష్ణుఁడు సంచరించీని**
**పోది మాని కన్నగత్తై పొందు మీ రసురలు** ॥పల్లవి॥

**తేరుమీఁద నెక్కీ నేఁడు దేవోత్తముఁడు వాఁడె**
**సారమైన శంఖచక్ర శార్ఙ్గా యుధము లవే**
**కారుకమ్మీ నాకాసాన గరుడధ్వజం బదే**
**పారరో దానవులాల పంతములు విడిచి** ॥వీదు॥

**దండవెట్టె నల్లవాఁడే దైవాలరాయఁడు**
**దండి నెట్టెపుఁజుట్లతపారపుచుంగు లవే**
**కొండవంటిరథ మదె కొన పైఁడికుండలవే**
**గుండుగూలి విరుగరో గొబ్బున దైతేయులు** ॥వీదు॥

**విజయశంఖము వట్టె వీఁడె శ్రీవేంకటేశుఁడు**
**భజన నలమేల్మంగ పలమారు మెచ్చీ నదె**
**త్రిజగాన నాతనిఁ జేరినదాసు లిదె వీరె**
**గజబెజ లిఁక నుడుగరో రాక్షసులు** ॥వీదు॥ **487**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో తిరుమలేశుని రథోత్సవాన్ని వినుతిస్తూ దుర్మార్గులైన అసురుల్ని పారిపోయి ప్రాణాలు దక్కించుకొని బుద్ధిగా బతకమని చెబుతున్నారు. ఓ అసురులారా! వీధుల వీధుల నెల్లా విష్ణుదేవుడు సంచరిస్తున్నాడు. పోదిమాని (దర్పము వదలి) కంటికి కనుపించకుండా పోండిరా! దేవోత్తముడైన స్వామి నేడు రథముపైనెక్కి వస్తున్నాడు. అవిగో ఆయన ఆయుధములైన శంఖ చక్రములు, శార్ఙ్గము. గరుడధ్వజము రెపరెపలాడుతున్నది. ఓ దానవుల్లారా! మీ పంతాలు మాని పారిపోండిరా. దేవతలనాయకుడైన స్వామి అల్లవాడే (అదిగో ఆ వచ్చేవాడే) దండవెట్టె (దెబ్బలు తింటారు). అదిగో యెట్టెదురుగా చుట్టలుచుట్టిన తలపాగ ధరించి హరి వస్తున్నాడు. ఆయన రథం కొండలాగా కదలివస్తున్నది. ఓ దైత్యులారా! గొబ్బున (శీఘ్రముగా) గుండుగూలి (చుట్టుముట్టబడతారు), లొంగిపోండిరా! ఈ శ్రీవేంకటేశ్వరుడు, ఇదిగో విజయశంఖమును పూరించుచున్నాడు. దేవి అలమేల్మంగ ఆయనను అనేకవిధములుగా పొగడుచున్నది. త్రిజగములలోని ఈ స్వామి దాసులు ఇదిగో వీరే. ఓరాక్షసులారా! కలతపడి మీరు తగ్గిపోండిరా!

★ **గజబెజ** – కలతపడి ★ **తపారచుంగులు** – చుట్టలుచుట్టిన తలపాగ





సంఖ్య : XV/396 రాగం : లలిత పుట: 266

**34 అందుకే నాపై దయ దలఁచు మాతురబంధుఁడవు**
**యిందరిలో నా దైన్య మేమని చెప్పే నిఁకను** ॥పల్లవి॥

**నేరమి వచ్చినచోట నీ మొగమే చూతుఁ గాని**
**యేరీతిఁ బరిహరింప నే నోపను**
**తీరని పాపము లంటితే నారాయణ యందుఁ గాని**
**పేరుకొని యది విడిపించుకొన నెఱుఁగ** ॥అందుకే॥

**పరులు నాపయిఁ గినిసితే భావింతుఁగాని నిన్నే**
**బిరుద నే నై మలసి తప్పించుకో లేను**
**సరి నాపదైతే నీకే శరణంబు చొత్తుఁగాని**
**వొరులకుఁ జెప్పియట్టే వొడ్డించుకోఁజాలను** ॥అందుకే॥

**కడుఁ జింతైతే నీవు గలవని వుందుఁ గాని**
**దిడముగా నా బుద్ధి తిప్పఁగ లేను**
**అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగపతి**
**బడివాయకుందుగాని బయపడనేనికను** ॥అందుకే॥ **396**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో శ్రీహరిని తన ఆత్మబంధువుగా పేర్కొంటూ కాబట్టే తనను దయదలచమని వేడుకొంటున్నారు. ఈ శరణాగతి యెంత హృద్యమమో చిత్తగించండి. ఇందరిలో నా దైన్యమును ఇంకా యేమని చెప్పను ప్రభూ? చెప్పలేని స్థితి నాది. నీవే నా ఆతురబంధుడవు (ఆత్మబంధువు) అందుకే నాపై దయదలచవయ్యా! ప్రభూ! నాపై యేదన్నా నేరము మోపబడితే, దానిని యేవిధముగానైనా పరిష్కరించగల సమర్థుడను కాను. నీ మొగము చూడటం తప్ప నాకేమీ రాదు. తీరని పాపములను నాకంట గట్టితే నేను చేయగలిగింది "నారాయణా" అనటం మాత్రమే. నాపాపమేమిటో పేర్కొని నిర్దోషినని నిరూపించుకోలేని "చేతకానివాడను". పరులు నాపై ఆగ్రహించితే నిన్నే భావింతును స్వామీ! నా బిరుదు (సమర్థత) నాఅంత నేను చూపి తప్పించుకోలేను. ఏదన్నా ఆపదవస్తే ఏడుకొండలవాడా! శరణు మహాప్రభో! అనగలనుగాని, ఎవరైనా "పెద్దవాళ్ళకు" చెప్పించి ఆపదగట్టెక్కలేను. అధికంగా 'చింత' కలిగితే నీదే భారమని వూరక వుందునుగాని స్థిరముగా నా బుద్ధిని వాటిపైనుంచి మళ్ళించి నిశ్చింతగా వుండలేను. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అలమేల్మంగ వల్లభుడవు. నేను నిన్ను విడువజాలను. ఇంక నేను భయపడుట దేనికి తండ్రీ?

★ **అడరి** – అతిశయించి ★ **కినిసితే** – ఆగ్రహించితే

సంఖ్య : II/308 రాగం : లలిత పుట: 208

**35 ఇవ్వల వెదకితేనే యేమి లేదు**
**అవ్వలికి దాఁటి మీరు అందుకోరో శుభము ॥పల్లవి॥**

**కనురెప్పలతుదలఁ గట్టువడెఁ గాలము**
**ఘనమై చేతులతుదఁ గర్మమున్నది**
**మనసుకొట్టఁగొననే మరి దైవ మున్నాఁడు**
**చెనకి యిఁక నెన్నఁడు సేయరో పుణ్యములు. ॥ఇవ్వ॥**

**కనకము దాఁటితేనే ఘనసుఖ మున్నది**
**వెనక చీఁకటికొన వెలుఁగున్నది**
**వనితలఅవ్వలనే వరవిజ్ఞాన మున్నది**
**పనిగొని యితవైతే బ్రదుకరో జీవులు, ॥ఇవ్వ॥**

**కాయముకొట్టఁగొననే ఘనవైకుంఠ మున్నది**
**బాయట శ్రీవేంకటపతి వున్నాఁడు**
**మాయలకొనలనెల్లా మనము నున్నారము**
**పాయక తెలుసుకొని పట్టరో యీతెరువు. ॥ఇవ్వ॥ 308**

**భావ దర్పణము :**

ఒక గొప్ప అధ్యాత్మకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ బాహ్య ప్రపంచంలో వెదకితే ఏమియులేదు. దీని నుంచి విడివడి అవ్వల (అవతల) భక్తి, వైరాగ్యములసిద్ధి గడించి వెదకి మీరు (భక్తులు) అందుకోరో శుభము అంటున్నారు. కనకము కావాలనుకొన్నంత కాలము ఘనసుఖము కనలేము. కాలచక్రము తిరుగుతూనే వున్నది కానీ, కనురెప్పలు మూసినవాడికి కాలగమనమే లేదు. అందుకనే కాలము కనురెప్పల చివరవుంటుంది. మనము చేసే కర్మలన్నీ, మన చేతుల చివరనే వుంటాయి. మరి దైవము యెక్కడ వుంటాడు? మన మనస్సు కొట్టికొనవుంటాడు. అందుకనే పూనుకొని ఇకనైనా పుణ్యము చేయండయ్యా! గొప్పసుఖము యెక్కడవున్నది? కనకముపై కాంక్ష లేనివాడి దగ్గరవున్నది. వెలుగు యెక్కడ వున్నది? చీకటి అంచున వెలుగువున్నది. వనితల అవ్వల వరవిజ్ఞానమున్నది. స్త్రీ వ్యామోహం లేనివాడికే భగవత్ జ్ఞానం కలుగుతుంది. ఓ జీవులారా! పూనికతో హితము కలుగుజేయుచు బ్రతుకుడయ్యా! ఘనమైన వైకుంఠము యెక్కడున్నదో తెలియునా? కాయము కొట్టగొననున్నది. కాయమున్నంతకాలము అదీ లేదు. అదిగో మన బయటనే శ్రీవేంకటపతి వున్నాడు. మరి మనమెక్కడున్నాము. ఆ దేవదేవుని మాయల చివర మనం వున్నాము. ఇకనైనా ఆ మాయలలో తగులుకొనక ఆయన బాట పట్టండి. మానవ జన్మ సార్థకము చేసికొనండి.

★ **చెనకి** – ఎదిరించి ★ **పనిగొని** – దృఢచిత్తముతో





సంఖ్య : XV/395 రాగం : గౌళ పుట: 266

**36 ఇంత సేసినవాఁడవు యిఁక న న్నేలక పోదు**
**చింత దీర నీవే రక్షించుకొంట గాకా ॥పల్లవి॥**

**మక్కువ నీతో నేను మాటాడి యెఱుఁగుదునా**
**చొక్కపు నీవైన రూపు చూపితినా**
**నిక్కము నీ వుండేటి నెలవు దెలిసితినా**
**చిక్కి నీవే నా మది నిల్చితి వింతే కాక ॥ఇంత॥**

**కోరి నీ యవతారాల కూడిమాడి యాడితినా**
**యేరీతి నైనా సేవ సేయించుకొంటివా**
**నేరిచి వొకనాఁడైనా నిన్ను నేఁ దలఁచితినా**
**వూరకే నీ కృప నాపై నుంచితివి గాకా ॥ఇంత॥**

**యెన్నఁడైనా నిన్ను నేను యెనసి కొలిచితినా**
**నిన్ను దేవ రనుచు నెమకితినా**
**పన్నుగా నలమేల్మంగపతి శ్రీవేంకటేశ**
**తిన్నఁగా నన్నుద్ధరించితివి నీవే కాక ॥ఇంత॥ 395**

**భావ దర్పణము :**

ప్రభూ! నీవే నామనస్సు నీపై నిలిచిపోవునట్లు చేశావు. నీకృప నాపైనుంచావు, నన్నుద్ధరించావు, నన్ను మన్నించావు. ఇంతసేసినవాడవు నీవు నన్నేలకుండావుంటావా. నా చింతలన్నీ తీరునట్లు నన్ను తప్పక రక్షించుకోకుండా వుంటావా అంటున్నారు పెదతిరుమలయ్య. స్వామీ! నీవు నాకు అంతచేస్తే నేను నీకేం చేశాను? నీతో ఒక్కనాడన్నా మక్కువతో మాట్లాడానా? లేదు. నీ అందమైన రూపు కనులారా చూచితినా? లేదు. నిజముగా నీవుండే చోటు తెలుసుకొన్నానా? లేదు. అయినా నీ అంతట నీవే చిక్కి నామదిలో నిలిచిపోయావు. అది అటుంచు. దేవా! నీ అవతారముల లీలలను కూడివచ్చి యేనాడైనా ప్రదర్శించితినా? అంతెందుకు నీకుయెట్టి సేవనైనా చేసితినా? నీ నైజము తెలిసికొని ఒక్కనాడైనా మనస్ఫూర్తిగా నిన్ను తెలిసికొన్నానా? అయినా వూరకనే నాపై నీకృపను చూపావు కదా! ఓ దేవదేవా అతిశయించి నిన్ను యెన్నడైనా త్రికరణశుద్ధిగా కొలిచితినా? పోనీ నీవే భగవంతుడవని నీకోసం వెదకితినా? లేనేలేదు. అతిశయించి అలమేల్మంగపతివైన ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను తిన్నగా వుద్ధరించిన నీవు గాక నారక్షకులెవ్వరు?

★ **నెమకితినా** – వెదకితినా ★ **కూడిమాడి** – కూడివచ్చి

సంఖ్య : II/237 రాగం : ముఖారి పుట: 159

**37** ఆతఁడే యజమానుఁడు ఆదినారాయణుఁడు
ఆతనిబంట్లము మాకు నన్నిటా నిశ్చింతయె ॥పల్లవి॥

యేలికెగలబంటుకు యెక్కడిది విచారము
పాలించేమగఁడుగలపడఁతి కేడ చింత
కోలుముంద్రై తండ్రిగలకొడుకు కేది తొడుసు
యీలీల హరిదాసుని కెక్కడికోరికెలు ॥ఆతఁ॥

బలుదుర్గమువానికి భయ మేమిటా లేదు
కలిమిగలవానికి కడమ లేదు
యిల క్షేత్రవంతునికి నెందు దరిద్రము లేదు
అల శ్రీపతిబంట్లకు నలమట లేదు ॥ఆతఁ॥

పట్టినముద్రుంగరపుప్రధాని కెదురు లేదు
కుట్టిచాతనివారికిఁ గొంకు లేదు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయుసేవకులము
గుట్టుతోడ బ్రదికేము గుఱి మాకు నతఁడే ॥ఆతఁ॥ **237**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో భగవంతునిపై భారం వేసి జీవించేవానికి అంతా నిశ్చింతేనంటున్నారు. ఆతడే (ఆ శ్రీహరియే) మా యజమాని. ఆతడే ఆదినారాయణుడు. మేము ఆతని బంట్లము (దాసులము), మాకు అన్నిటిలోను నిశ్చింతయే. ఆయన రక్షణలో వున్న వారికి విచారమెందుకు వుంటుంది. ప్రాపంచిక దృష్టితో చూడండి. తమ విధినిర్వర్తిస్తూ నిజాయితీవున్న దొరగారి బంట్లకు విచారమెందుకుంటుంది? చక్కగా యేలుకొనే మగడున్న భార్యకు చింతయెదుకు? కోలుముంద్రై (మున్ముందువుండి) రక్షించే తండ్రి వున్న కొడుకునకు బాధ్యతలతో సంబంధం వుంటుందా? ఇదేవిధంగా హరిదాసులకు చిల్లర కోరికలతో సంబంధమేమి? బలిష్టమైన దుర్గమువున్న వానికి శత్రుభయం యెందుకు? సంపదవున్నవానికి కొఱతవుండనే వుండదు. చక్కగా పండే పొలమువున్నవానికి దరిద్రమనేదే వుండదు. అట్లాగే శ్రీపతి బంట్లకు అటమట (దుఃఖము) వుండనే వుండదు. రాజముద్రిక వున్న రాజుగారి ప్రధానమంత్రికి యెదురనేది వుంటుందా? కుట్టి చాతనివారికి (కుట్టి సైతాన్ అనే క్షుద్ర విద్య నేర్చినవారికి) గొంకులేదు (జంకూ గొంకూ వుండవు). కట్టెదురనున్న శ్రీవేంకటేశుని సేవకులము. మేము పటాటోపం లేకుండా బ్రతుకుతాము. ఎందుకంటే ఆయనే మా రక్షకుడు.

★ **తొడుసు** – సంబంధము ★ **క్షేత్రవంతుడు** – పొలముగలవాడు





సంఖ్య : XV/314 రాగం : ముఖారి పుట: 218

**38** ప్రయాసపడవద్దు బయలు వెదక వద్దు
క్రియ యెఱిఁగినఁ జాలు గెలుతు మిందుననే ॥పల్లవి॥

శ్రీపతిసులభుఁడు చింతించనేర్చిన
దీపించుమనసు కొని తేవలదు
చేపట్టుఁ గుంచము కదు జిహ్వాకుఁ దిరుమంత్రము
దాపగు తులసితీర్థము నఱచేతిది ॥ప్రయాస॥

అదే వీనులపండుగ ఆచార్యోపదేశము
ముదమున నొసలనే మొక్కు లున్నవి
హృదయము నిక్షేపము యెఱిఁగితే సుజ్ఞానము
సదరము భుజములఁ జక్రలాంఛనములు ॥ప్రయాస॥

తావుగ దేహమందు ద్వాదశనామములకు
సావివోని సంకల్పమే శరణాగతి
శ్రీవేంకటేశుఁడే దిక్కు జీవులకు నెల్లాను
దేవుఁ డితఁడే మనకుఁ దెలుసుకోరో ॥ప్రయాస॥ **324**

**భావ దర్పణము :**

పెదతిరుమలాచార్యులవారు వైష్ణవ భక్తులకు యేమిచెబుతున్నారో వినండి. ఓ భక్తులారా! మీరు అనవసరంగా ప్రయాసపడవద్దు. భగవంతుని కృప బయటవెదకితే దొరికేది కాదు. భగవంతుని యెటుల ధ్యానించాలో, ఆ క్రియనెరిగితే చాలు, ఇందుననే (ఈభూమిమీదే) గెలుతుము, (పరమాత్మను సాధించగలము). ధ్యానించుట తెలిసిన వారికి శ్రీపతి సులభసాధ్యుడు. ఆయన మన మనస్సులో దీపించును. అప్పుడు కుంచము (కొలత పాత్ర) ధాన్యము కాదు కావలసినది, జిహ్వకు తిరుమంత్రము (ఓం నమో నారాయణాయ). అరచేతిలో తులసితీర్థము కావాలి. మరి చెవులకు ఆచార్యుని ఉపదేశము, నొసలు నేలకు తాకునట్లు మొక్కుట, హృదయము నిక్షేపమై పరమజ్ఞానము నెఱుగుట, భుజములపై శంఖచక్ర లాంఛనములను ధరించుట అత్యవసరము. దేహముపై పన్నెండు తావులలో పుండ్రములు (పంగనామములు) ధరించుట, సాటిలేని సంకల్పముతో భగవంతునికి శరణాగతి జెప్పుట మొదలైనవి, సంప్రదాయము. కాని జీవులకు శ్రీవేంకటేశుడే దిక్కు, యెందుకంటే దేవుడంటే ఇతడే అని మనస్సులో తెలియుడయ్యా!

★ **సావివోని** – సాటిలేని ★ **సదరము** – స్పష్టముగా

సంఖ్య : II/240     రాగం : శుద్ధవసంతం     పుట: 161

**39 మాయ కిదె సహజము మాయను గెలువరాదు**
**మాయానాథుఁ గొలిచితే మన్నించు నాతఁడే ॥పల్లవి॥**

**చేతికి లోనైనట్టుండు సృష్టిలోనివేడుకలు**
**పోతరించి పట్టఁబోతేఁబోవు నట్టటే**
**ఆతుమలో వేసరి అలసి వూరకుండితే**
**వైతాళపునీడవలె వచ్చు వెంటవెంటను ॥మాయ॥**

**తీపువలెనే వుండు దిష్టపుఁబదార్థాలు**
**మేపుగొంటే మీసాలమీఁదితేనౌను**
**యేపున నాస విడిచి యేరుపడి వుంటేను**
**మూపునఁగట్టినచద్దై మోఁపించును ॥మాయ॥**

**తలఁపులోనే వుండు తనలోని యంతరాత్మ**
**తెలుపుకోఁబోతే పెక్కు దేవతలౌను**
**చలపట్టి యీతనినే శరణని కొలిచితే**
**యెలమి శ్రీవేంకటేశుఁ డీతఁడై రక్షించును ॥మాయ॥ 240**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో జీవులను భ్రమింపజేసే విష్ణుమాయ యొక్క ఘనతను వివరిస్తున్నారు. ఈ భ్రమలో ముంచటం మాయయొక్క సహజగుణం. దానిని యెవ్వరూ గెలువలేరు. దీనికి ఒకటే దారి. మాయానాథుడైన శ్రీహరిని గొలిచితే ఆతడే మన్నించి మనను దాంట్లోంచి బయటపడేస్తాడు. ఈమాయ మన చేతికి చిక్కినట్లే వుంటుంది. కాని సృష్టిలోని వేడుకలనన్నీ రుచిచూపించి దాన్ని పట్టుకోబోతే చిక్కకుండా పోతుంది. ఆత్మకూడా ఈమాయను తాళలేక విసిగి వూరకుండితే "భేతాళుడి నీడవలె" వెంటవెంటనే వస్తుంది. దానినేమి చేయగలము చెప్పండి? మన యెదురుగా కనుపించే పదార్థాలన్నీ మధురంగానే వున్నట్లు కనిపిస్తాయి. దానిని అనుభవిస్తే మాత్రం మీసం మీదితేనె మాత్రమే. ఆ మాధుర్యం క్షణంలో మాయమై గుచ్చుకోవటం మొదలవుతుంది. అయితే ఆశను విడనాడివుంటేనే మూపున కట్టుకొన్న చద్దివలె మోయించుకొంటుంది, కాని మేలు చేస్తుంది. మన అంతరాత్మ యెక్కడవుంటుందో తెలుసునా? మన తలపులోనే వుంటుంది. ఇంకా ఇంకా దాని గురించి తెలుసుకోబోతే అదే వూహలోంచి వచ్చే అనేక దేవుళ్ళవుతుంది. పంతముతో ప్రభూ! నీవే దిక్కు, నీకే శరణు అని కొలిచితే ఈతడే శ్రీవేంకటేశ్వరుడై రక్షిస్తాడు.

★ **మోపించును** – మోయించుకొంటుంది ★ **వైతాళిపునీడ** – భేతాళుడి నీడ





సంఖ్య : XV/156   రాగం : సాళంగనాట     పుట: 104

**40 ఈతని కెదురు లేరు యెక్కడ చూచిన నిదె**
**చేతనే ప్రతాపముతో చెలరేఁగీ నితఁడు ॥పల్లవి॥**

**దిక్కులు సాధించుటకు దేవదేవోత్తముఁ డదె**
**యెక్కెను తేరుమీఁద యెచ్చరికతో**
**చక్కాడి దనుజులను సమరములు గెలిచి**
**యిక్కువతో వీధి వీధి నేఁగీ నిదిగో ॥ఈతని॥**

**సకలాయుధములునుఁ జక్రము చేతులఁ బట్టి**
**వెకలియై శంఖము వేవేగ నాడించె**
**వికలులై రాక్షసులు వీఁగి లోఁగి హతులైరి**
**అకలంకుఁ డీ హరి అన్నిటాను మించెను ॥ఈతని॥**

**విజయధ్వజము నదె వీఁడె శ్రీవేంకటేశుఁడు**
**భజన నలమేలుమంగ పలుమారు మెచ్చె నదె**
**త్రిజగములు నితఁడె దిక్కై కాచీ నిదె**
**గజబిజ లింక నుడుగరో రాక్షసులు ॥ఈతని॥ 156**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో శ్రీవేంకటేశుని రథోత్సవమును కళ్ళకు కట్టిస్తున్నారు. ఎవ్వరూ ఈతని నెదిరించలేరు. ఎక్కడ చూచినా ఈతని రథమే కానవచ్చుచున్నది. ఇతగాడు తన ప్రతాపము చేతనే చెలరేగిపోవుచున్నాడు. ఇతనిని చూచి తరించండి. దశదిశలను కైవశము చేసికొనిన ఆ దేవదేవోత్తముడు తన రథముపై అతిశయముతో యెక్కినాడు. ఆయన దనుజులను ఖండించి అనేక యుద్ధములను గెలిచినాడు. ఇదిగో నేడు తిరువీధులగుండా దర్పముతో వూరేగుచున్నాడు. తన సమస్త ఆయుధములతోను, రెండు చేతులలో శంఖ చక్రములను ధరించియున్నాడు. పాంచజన్య శంఖము యొక్క ధ్వనిని విని రాక్షసులు బెంబేలెత్తి, లొంగిపోయి భీతిచే మరణించిరి. కళంకము లేని శ్రీహరి అన్నిటా మించియున్నాడు. అదిగో శ్రీవేంకటేశుడు, విజయధ్వజము అల్లదిగో. అలమేలుమంగ అనేకపర్యాయములు స్వామిని మెచ్చుకొంటుంటే ముల్లోకములకు తానే దిక్కై ఇతడు రక్షించుచున్నాడు. ఓ రాక్షసులారా! గజబిజల (కలవరపాటుతో) కృశించిపొండు.

★ **చక్కాడి** – ఖండించి ★ **ఉడుగరో** – కృశించుడు

సంఖ్య : II/5 రాగం : ముఖారి పుట: 4

**41** **పులుగు చెప్పెడి నదె పొంచి మాగురుఁడు నీకు**
**తలఁచుకో నేఁడు నీవు దాఁచినర్థము** ॥పల్లవి॥

**యిలమీఁద తమసొమ్ము లెవ్వరివద్ద నుండినా**
**తలపిడి కొలుపిడి తగిలినట్టు**
**తొలుత పంచేంద్రియపుదొంగలవద్ద నున్నాఁడ**
**వెలయ నీసొమ్మనుచు విడిపించుకొనవే** ॥పులు॥

**చేరి తమవూరివారి చెఱవట్టుకొని పోతే**
**కోరి కుయివోయి తెచ్చుకొన్నట్టు**
**వూరక నీకుక్షిలోనవున్న నన్ను నీమాయ**
**వీరానఁ జెఱవట్టెను విడిపించుకొనవే** ॥పులు॥

**బడిదప్పి తరిగేటిపడుచుల తమవారు**
**తడయక తెచ్చుక ఆదరించినట్టు**
**వెడబుద్ధిఁ దిరిగేను వెఱ్ఱిని శ్రీవేంకటేశ**
**విడువక అజ్ఞానినన్ను విడిపించుకొనవే** ॥పులు॥ **5**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలోని కొన్ని పదములు నిఘంటువులలో కానరావు. వాటిని భావించవలసినదే. రవ్వా శ్రీహరిగారి నిఘంటువు వలన దీనిని నేనీమాత్రమన్నా వివరించగలిగానంటే అంతా "శ్రీహరి" కృపే. పులుగు అంటే తమిళ సంస్కృతివలన "అబద్ధము" అనుకొంటే ఈ పల్లవి భావమిది – మాగురుడు అబద్ధము చెప్పారనిపిస్తే దానిలో దాగిన అర్థము నీవు నేడు తలచుకోవయ్యా! ఈ భూమ్మీద తన సొమ్ములు (నగలు) యెవ్వరి దగ్గరనున్నా 'తలపిడి కొలుపిడి' (తరుగేమన్నా పోయిందా, వన్నెయేమైనా తగ్గిందా) అని పరీక్ష చేయించుకొనినట్లే... నా పంచేంద్రియములనే దొంగల వద్ద ఇన్నాళ్ళూ గడపిన నీ సొమ్మునైన నన్ను పరీక్షించి తూపించుకొని వారి వద్ద నుండి నన్ను విడిపించుకోప్రభూ! బందిపోటు దొంగలు మనవూరి వారిని చెఱబట్టుకు పోతే జాలితో వూరివారు కోరి ఆర్తరక్షకులుగా విడిపించుకొనినట్లు నేను నీకుక్షిలోని వాడను గనుక నన్ను చెఱబట్టిన నీ 'మాయ' నుండి వీరత్వము జూపి విడిపించుకోవయ్యా! మనకట్టుబడి నుంచి మన వనితలు పెడదారిబట్టి పోతే, పోనీలే అమాయకులు అని తిరిగి వారిని మన ఇంటికి రానిచ్చి, సంస్కరించుకోమా? ఆదరించమా? ఓ శ్రీవేంకటేశ్వరా! నేను కూడా పెడబుద్ధితో తిరిగిన వెఱ్ఱివాడనయ్యా! అజ్ఞానిని. నన్ను ఈ అజ్ఞానం నుంచి విడిపించుకో స్వామీ!

★ **తడయక** – ఆలస్యముచేయక ★ **కుక్షిలో** – కడుపులో





సంఖ్య : XV/74 రాగం : మలహరి పుట: 49

**42** **పుట్టుగ పుట్టుగ పొద్దొక వింతే**
**యెట్టు గడచేమీ విష్ణుమాయా** ॥పల్లవి॥

**యెత్తిన దేహాల యెమ్ములు చివికే**
**చిత్తమొక్కటే చివుకదు**
**మొత్తముఁ బుట్టించి ముదిసె బ్రహ్మయు**
**పొత్తుల జీవుఁడేపో ముదియఁడు** ॥పుట్టగ॥

**వ్రాసే చిత్రగుప్తవరుఁడు వేసారె**
**వేసారేఁ పాపపువిధి నేఁడు**
**గాసిఁ బెరరేఁచే కాముఁడు సమసె**
**యీసుల సమయ విం్రదియాదులు** ॥పుట్టగ॥

**వినుకనివంక విజ్ఞానము వుట్టె**
**కనుకనే యిఁకఁ గైవాలదు**
**అనుగు శ్రీ వేంకటాధీశుమన్నన**
**తనిసినబుద్ధిఁ తప్ప దిఁక** ॥పుట్టగ॥ **74**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య యెంత గొప్ప సత్యం చెబుతున్నారో, ఆలకించండి. పుట్టుకమీద ఇంకొక పుట్టుకవస్తూనే వుంటుంది. కొత్త పుట్టుక ఇంకొక పొద్దు పొడచూపినట్లు వింతగానే వుంటుంది. బాల్యం, యౌవనం, కౌమార వృద్ధాప్యాలు... వాటిలో అనేక భ్రాంతులూ... ఇది శ్రీహరి మాయ. దీనిని యెట్లా నెగ్గుకు రాగలము? మరి దారియేమిటి? ఎన్నిపుట్టుకలైన దేహాలు యెముకలు కొత్తవి. కానీ కొన్నాళ్ళకి అవీ చివికి (సారహీనమై) పోతాయి. మనస్సు యెన్నడు చివుకదు. ఈ మొత్తం జీవకోటిని పుట్టించే బ్రహ్మగారూ ముసలి అవుతాడు. మరి ముసలివాడు కానిది యెవరు? ఈ జీవుడు. మన పాపపుణ్యాల "చిట్టా" వ్రాసీ వ్రాసీ పాపం చిత్రగుప్తుడు వేసారిపోతున్నాడు. విధి మన భవితవ్యం మన నుదుట వ్రాసీ వ్రాసీ అలిసిపోతున్నాడు. మన్మథుడు కూడా ఈ జీవులను కామపీడితులను చేసీచేసీ చావుకూడా తెచ్చుకున్నాడు కానీ వాడిపని ఇంద్రియాలు స్వీకరించాయి. అవి యెన్నటికీ నశించని "ఆశ"లను పుట్టిస్తున్నాయి. ఇదే శ్రీహరి మాయ అంటే. వినుట చేతనే విజ్ఞానము (అధ్యాత్మజ్ఞానము) కలుగుతున్నది. అందుకనే ఆ విజ్ఞానము ఒక్కసారి కలిగితే ఇక నశించదు. ప్రేమాస్పదుడైన శ్రీవేంకటేశుడి మన్ననతో తృప్తి చెందిన బుద్ధి మరెన్నటికీ దారితప్పదు.

★ **కైవాలదు** – నశించదు ★ **గాసిన్** – బాధ

సంఖ్య : II/201 రాగం : గౌళ పుట: 135

43 ఒడఁబరచుకొంటిని వుపేంద్ర నిన్ను నిపుడె
చిడిముడి నీసేవకే సెలవుచేసుకొమ్మీ ॥పల్లవి॥

కన్నుల నేఁ జూచేదెల్లా కమలాక్ష నీపాదాలే
విన్నవినుకులెల్లా విష్ణుఁడ నీకథలే
తిన్ననినామాటలెల్లా త్రివిక్రమ నీమంత్రాలే
అన్నిటా నాభావము సమర్పణము నీకును ॥ఒడఁ॥

అట్టె నే నడచేవెల్లా హరి నీప్రదక్షిణాలే
గుట్టున నాసేఁతలెల్లా గోవింద నీకైంకర్యాలే
ముట్టి నేభుజించినవి ముకుంద నీప్రసాదాలే
నెట్టన నాభోగమెల్లా నీవసము చేసితి ॥ఒడఁ॥

యిల నేఁ బండఁబడేవి యీశ్వర నీకు మొక్కులే
తలఁచే నాతలఁపెల్లా దామోదర నీధ్యానమె
నలువంక శ్రీవేంకటనాయక నీయనుజ్ఞను
నెలవై నాభవములెల్లా నీసొమ్ము చేసితి ॥ఒడఁ॥201

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో ఉపేంద్రుడైన శ్రీహరితో యేమంటున్నారో ఆలకించండి. ఓ ఉపేంద్రా! నిన్ను నేను యిపుడే అంగీకరింపజేసికొంటిని. నన్ను నీ చిడిముడి సేవకే (సంభ్రమంతో చేసే సేవకు) సెలవుచేసుకొమ్మీ (ఉపయోగించుకోవయ్యా!) ఓ కమలాక్షా! నేను నా కన్నులతో చూచేది నీపాదములే. ఓ విష్ణుడా! నా చెవులు వినగలిగేది నీకథాశ్రవణమే. ఓ త్రివిక్రమా! కల్లాకపటంలేని యుక్తమైన నీ మాటలే మంత్రాలు. అన్ని విధములా నా భావమే నీకు నా సమర్పణము. ఇంతకంటే యేమి సమర్పించగలను? ఓ శ్రీహరీ! నేను నడచెడిదంతా నీ ప్రదక్షిణమేనయ్యా! ఓ గోవిందుడా ! నేను గుట్టుగా చేసెడిదంతా నీ కైంకర్యమే (ఊడిగమే). ఓ ముకుందా! నేను ముట్టి భుజించేదంతా నీ ప్రసాదములే. నా భోగము కొఱకు నీవిచ్చినదంతా నీవశము గావించితిని. ఇదే నేను చేయగలిగినది ప్రభూ! ఓ ఈశ్వరా! ఈ భూమిపై, పండబడేవి (నేను పండుకొనునవి) నీకు చేసే సాష్టాంగ దండప్రమాణములే. ఓ దామోదరా! నేను తలచే నాతలపంతా నీ ధ్యానమే. ఓ వేంకటనాయకా! నలుదిక్కులా నేను పొందే నా పుట్టుకలన్నీ నీ సొమ్ము చేసితినయ్యా! నాకు ముక్తినిచ్చే భారమంతా నీదే తండ్రీ!

★ **తిన్ననిమాటలు** – యుక్తమైన మాటలు ★ **వసము** – స్వాధీనము





సంఖ్య : XV/50 రాగం : గుజ్జరి పుట: 33

44 పాపము చేరువ ప్రాణునికి
యేపున పుణ్యంబేదోకాని ॥పల్లవి॥

ముక్కున నున్నది ముంగోపం బిది
యెక్కువ శాంతం బెందున్నదో
చిక్కని యాసలు చేతిలో నున్నవి
గక్కున విరతే కానము గాని ॥పాపము॥

కన్నుల నున్నది కామాంధకారము
యెన్నిక విజ్ఞాన మెందున్నదో
వున్నది నాలుక నూరక దైన్యము
యిన్నిట ధైర్యం బెఱుఁగము గాని ॥పాపము॥

అవిగో తనువున ననాచారములు
యివల సద్ధర్మం బెందున్నదో
వివర మొసఁగి శ్రీవేంకటేశ నా
భవ మీడేర్చఁగ బ్రదికితిఁ గాని ॥పాపము॥50

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో మానవులు చేసే పాపపుణ్యాలమధ్య పెద్ద దూరమువున్నదో లేదో? పుణ్యమేమిటో? సద్ధర్మంబెందున్నదో? ఈ దైన్యం పోయి ధైర్యం యెప్పుడొస్తుందో? ప్రాణులకి పాపము ఇంత చేరువ అవుతుంటే మరి 'పుణ్యము' అనిదేనినంటారు? చెడుచేరువైనంతగా మంచి యెందుకు చేరువ కాదంటున్నారు. మనకు విపరీతమైన "కోపము" ముక్కుననే వుంటున్నదే!! మరి యెక్కువ శాంతము యెందున్నదో కదా! మనకు స్వాధీనముకాని ఆసలు మనచేతిలోనే వున్నవి. కాని నిర్మోహము (విముఖత్వము) మాత్రం దరిదాపులో కనుపించుటలేదు. కామముతో కళ్ళుకప్పివేయబడినవంటారే అది నా కనులముందే వున్నది. కాని యెన్నికైన విజ్ఞానము, ఆత్మజ్ఞానము యెందున్నదో తెలియవచ్చుటలేదు. నా నాలుక దైన్యంతో పరులను యాచిస్తుంటుంది. పిఱికి మాటలు మాట్లాడుతుంది. దీనికి ధైర్యమంటే యేమిటో యెలా వుంటుందో తెలియదు కానీ... యేమి దౌర్భాగ్యం!! అదిగో ఈ నా తనువు నిండా అనాచారమే. మరి ఇక్కడ సద్ధర్మంబెందున్నదో తెలియవచ్చుటలేదు. అటువంటి దుస్థితిలో శ్రీవేంకటేశ్వరుడు నాపై కృపతో నా పుట్టుకను యీడేర్చినాడు. అందువలన బ్రదికి బట్టకట్టగలిగినాము.

★ **వివరము** – వ్యాఖ్యానము ★ **ముంగోపము** – ఓర్పులేక తటాలున వచ్చే కోపము

సంఖ్య : II/9 రాగం : సాళంగనాట పుట: 7

**45** **అన్నిటి కెక్కుడుయీవి హరియిచ్చేది**
**మన్నించునాతనికంటే మతి లేరు దొరలు** ॥పల్లవి॥

**తగుబ్రహ్మలోకముదాఁకా నెక్కిచూచిన**
**మగుడఁ బుట్టేలోకాలే మనుజులకు**
**తెగి యిచ్చే యింద్రాదిదేవతలవరములు**
**యెగువదిగువలను యీసందివే** ॥అన్ని॥

**మాయలోనఁ బుట్టేది మాయలోనఁ బెరిగేది**
**కాయదారులకు నెల్లాఁ గలిగినదే**
**సేయరానిపుణ్యమెల్లాఁ జేసి గడించుకొనేది**
**చాయల బహురూపపుసంసారమే** ॥అన్ని॥

**చెడనివైకుంఠ మిచ్చుఁ జేటులేనివర మిచ్చు**
**వెడమాయఁ బెడఁబాపు విష్ణుఁ డీతఁడే**
**యెడయక శ్రీవేంకటేశుఁడై వున్నాఁడు వీఁడె**
**జడియ కితఁడే కాచు శరణంటేఁ జాలును** ॥అన్ని॥ **9**

**భావ దర్పణము :**

అన్నమయ్య యేమంటున్నారంటే, శ్రీహరి యిచ్చేది అన్నిటికన్నా అధికమైన ఈవి (దాతృత్వము). దొరలలో ఆతనికంటే మన్నించువారెవ్వరూ లేరు అంటున్నారు. ఆ దొరగారి విశిష్టతను ఇలా కీర్తిస్తున్నారు. మీరూ విని పరవశించండి. మరణానంతరం మనుష్యులు బ్రహ్మగారి సత్యలోకందాకా యేలోకం పొందినా వారి పుణ్యం తరిగిపోగానే భూమిపై జన్మించక తప్పదు. ఇంద్రాదిదేవతలు అతిశయించి ఇచ్చే వరములు మన జీవితకాలంలోగానీ మరణానంతరంగాని ఆ వరములన్నీ ఈ సందివే (ఇటువంటివే). మనమందరమూ మాయలోనపుట్టినవారమే. అట్లాగే మాయలోనే పెరుగుతాము. ఎక్కడ చూచినా ఈ మాయవుండేదే. అలివిగాని పుణ్యాలు చేసినా చిట్టచివరికి లభించేది చూడటానికి బహురూపముల కనుపించే సంసారమే. కాని, ఈ విష్ణుదేవుడిచ్చే వైకుంఠం యెటువంటిదో తెలుసా? ఇది చెడనిది, (నశించనిది). చేటులేని పరలోకప్రాప్తి అంటే ఇదే. పైగా తుచ్ఛమైన మాయలను, ఇది నివారిస్తుంది. ఈ విష్ణుదేవుడు తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడై వున్నాడు. భయపడకుండా ఈతనిని శరణుజొచ్చిన చాలును. ఈతడే కాపాడి రక్షించును.

★ **వెడమాయ** – తుచ్ఛమైన మాయ ★ **తెగి** – ధీరులై





సంఖ్య : XV/335 రాగం : లలిత పుట: 225

**46** **ఏమీఁ జదువనేల యెవ్వరి నడుగనేల**
**వేమారుఁ దనలోఁ దానే విచారించవలెను** ॥పల్లవి॥

**కలలోనఁ జూచినవి కల్లలౌతా నిజమౌతాఁ**
**దెలిసితే నదె వుపదేశము గాదా**
**ములిగినాఁ బోనిక మోపించే సంసారము**
**తిలకించితే నుపదేశము గాదా** ॥ఏమీ॥

**నినుపైరాత్రిఁ బగలు నిద్దిరించి మేలుకొనే**
**దినదినములే వుపదేశము గాదా**
**కనుమూసి తెఱచితే కలిగీ లేని మాయఁ బొం-**
**దిన జగ మిదే వుపదేశము గాదా** ॥ఏమీ॥

**చేవదేర వర మిచ్చే శ్రీవేంకటాద్రిమీఁది**
**దేవునిఁ గనుటే వుపదేశము గాదా**
**భావించి వేదము లెల్లాఁ బలుమారుఁ జాటఁగాను**
**దేవదేవుఁ డితఁ డుపదేశము గాదా** ॥ఏమీ॥ **335**

**భావ దర్పణము :**

"ఉపదేశము" అంటే హితవచనము అని అర్థము. పెదతిరుమలయేమంటున్నారంటే... మన చుట్టూ వున్న సంసారము, దినదినము వచ్చిపోయే రాత్రింబగళ్ళు, కల్లలు నిజములూ అయ్యే స్వప్నములు, ద్వారా శ్రీవేంకటరమణుడు మనకు అనునిత్యమూ హితోపదేశం చేస్తున్నారు. అటువంటప్పుడు యేమో చదివి, యెవరినో అడిగి శ్రమపడుట దేనికి? ఎవ్వరైనా తనలోతానే విచారించుకోవచ్చును కదా! అంటున్నారు. మనం ఒక కలకంటే అది కల్లకావచ్చు నిజము కావచ్చు. అది గ్రహించామంటే అదే చక్కని ఉపదేశం కాదా? ఈ సంసారమున్నదే, ఇందులో మునిగితే ఇక ఆ మునిగినవారినెక్కడికీ పోనీయదు. దీని అనుభవమే ఒక గొప్ప ఉపదేశము. మనము నిద్రిస్తున్నాము, మేల్కొంటున్నాము. ఇంతలో రాత్రింబవళ్ళు ఒకదాని తరువాత ఇంకొకటిగా గడిచిపోతూనేవున్నాయి. ఇవీ కొత్తకొత్త హితవచనాలను చెబుతూనే వున్నాయి. కళ్ళు తెరిస్తే కలిగి, కళ్ళు మూస్తే లేని ఈ జగత్తు కూడా గొప్ప ఉపదేశమునివ్వదా? బలపడునట్టి వరములనొసగే శ్రీవేంకటేశ్వరుడు, వేంకటాద్రిమీది దేవుడు. ఆయనను దర్శించుట గొప్ప ఉపదేశము. వేదములన్నీ భావించి యేమి చాటుతున్నాయి? దేవదేవుడంటే ఈ తిరుమలేశ్వరుడే అని చాటుతున్నాయి. ఇంతకన్నా గొప్ప ఉపదేశము వుంటుందా?

★ **చేవదేర** – బలపడునట్లు ★ **వేమారు** – అనేకపర్యాయములు

సంఖ్య : II/8 రాగం : సామంతం పుట: 6

**47** నూఁతులు దవ్వఁగఁబోతే బేతాళములు వుట్టె
కాఁతాళపులోకులాల కంటిరా యీసుద్దులు ॥పల్లవి॥

మీఁటినపుత్రకామేష్టి మించి లంకకుఁ బైవచ్చె
ఆఁటది రామావతార మసురబాధ
తూఁటి సీతపెండ్లి హరుదొడ్డ వింటిపండుగాయ
పాఁటి పాఁటి నమ్మ నెటువలెవచ్చు వీరిని ॥నూఁతు॥

చూడ కేకయరాజ్యము చుప్పనాతిపాపమాయ
వేడుక మాయామృగమువేఁటాయను
వాడికె సుగ్రీవుమేలు వాలికి గండాన వచ్చె
యీడుగానిరాచపుట్టు యెట్టు నమ్మవచ్చును ॥నూఁతు॥

వుమ్మడిఁ గోఁతులకూట ముదధికిఁ గట్లు వచ్చె
తమ్మునిబుద్ధి రావణుతల వోయను
పమ్మి శ్రీవేంకటేశునిపట్టానకే యింతానాయ
యిమ్ముల నిట్టిదేవర నెట్టు నమ్మవచ్చును ॥నూఁతు॥ **8**

**భావ దర్పణము :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన ఇదివరలో నా బుద్ధికి అందక నేను చేతులెత్తేసినదే. ఐదేళ్ళ తరువాత ఈపాటి వివరణనిచ్చే శక్తి ఆ నల్లనయ్య కృపాకటాక్షమే. ఓ లోకుల్లారా! మీరు కాతాళము (కోపము) గలవారు. మరి ఈ కథలు విన్నారా. ప్రపంచంలో ఒకమంచి చేయబోతే చెడు ప్రాప్తించవచ్చు. నూతులు తవ్వబోతే గోతిలోంచి నీరుకాక అస్థిపంజరపు యెముకలు దొరికాయట. అనాదిగా రామాయణ కాలంనుంచి జరిగిందే సుమా! దశరథుడు పుత్రకామేష్టి చేస్తే లంక తగలబడిపోయింది. ధర్మసంస్థాపనకు రామచంద్రుడు పుడితే రాక్షసులు బాధతో ప్రాణాలు వదిలారు. సీతాదేవికి పెండ్లి అనుకొంటే శంకరుడి గొప్ప విల్లు విరిగి మూలపడింది. దేనికోసం యేదిజరిగిందో యెవరు చెప్పగలరు? చెప్పినా, వారిని నమ్ముటెట్లు? కేకయ రాజ్య విస్తరణకు కైకమ్మ పూనుకొంటే చుప్పనాతి (శూర్పణఖ) ముక్కుచెవులు తెగిపోయాయి. భార్య కోరిక తీరుద్దామనుకొంటే బంగారు లేడి ప్రాణాలు వదలింది. సుగ్రీవుడి పట్టాభిషేకం, వాలి వధకు వేదిక అయింది. హరియైనా హద్దులు లేని రాచపుట్టుక పుడితే నమ్మేదెట్లా చెప్పండి. కోతులు వుమ్మడిగా యెలుగుబంట్లను చేరితే సముద్రంలో రాళ్ళుపడి దాటటం అసాధ్యమనిపించుకొన్న సాగరం కట్టుబడింది. తమ్ముడి బుద్ధికి, రావణుడి తలలు బుగ్గిపాలయ్యాయి. అదే దేవుడు నేడు శ్రీవేంకటేశ్వరుడైతే ఆయన కీర్తికి ఇదంతా అతిశయించింది. మరి ఈ మహానుభావుణ్ణి యెట్లా నమ్మవచ్చునో చెప్పండి.

★ **ఈడుగాని** – హద్దులులేని ★ **పాటిపాటి** – పరుగులుపెట్టి





సంఖ్య : XV/102 రాగం : దేవగాంధారి పుట: 68

**48** నీ దయాధర్మమునకు నీ చిత్తమిఁక
యీదెస మానేర్చు లిఁక యెంచఁగలదా ॥పల్లవి॥

యీవల నా యపరాధ మెఱుకతో నీకుఁ జేసి
గావు మని మిమ్మన సంగతులా నాకు
కైవసమై నీకు వేళ గాచి యుండి కొలువక
సేవించ చేయెత్తి మొక్క సిగ్గు గాదా నాకు ॥నీద॥

మన్నించిన నీ మన్నన మఱచి మత్తుఁడనై
యిన్నిటా నీవాఁడ నంటే యే మందువో
యెన్నిక ద్రోహినై యిప్పుడిచ్చకాలు సేయఁబోతే
నన్నుఁ జూచి పరులెల్లా నవ్వరా యింకాను ॥నీద॥

కొంత సంసారభక్తితో కోరి నీ భక్తుఁడనైతి
వంతుల విజ్ఞాన మెటువలె నుండునో
యింతట శ్రీ వేంకటేశ యిట్టె నన్ను రక్షించితి
వంతర్యామివి నీవు అది నా విన్నపము ॥నీద॥ **102**

**భావ దర్పణము :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో స్వామితో వినయము వుట్టిపడుతుండగా యేమంటున్నారో వినండి. ప్రభూ! నీ దయాధర్మమునకు ప్రతిగా నేనేమీయగలను? ఇకపై నీ చిత్తము నా భాగ్యము. ఇటువైపు నా నేర్పెమిగొప్పదని నిన్ను యెంచమని అడుగగలను? నీవు తప్పులనెంచక నీదాసుడనని నన్ననుగ్రహింపుము. ఈరీతిగా నా అపరాధముల నన్నింటినీ నీకు యెఱుక జెప్పి, రక్షించమని మిమ్ము వేడితే అది సంగతియవుతుందా. నిన్ను యేవేళనైనా కొలువక (సేవించకుండా) ఈ రోజు చేయెత్తి నీకు మొక్కాలంటే నాకే సిగ్గుగా వున్నది దేవా! ఓ ప్రభూ! నన్ను నీవు అనేకమార్లు మన్నించావు. కాని, నీ మన్నన మఱచి, మత్తెక్కినవాడనై ఇవ్వాళ నేను నీవాడనే స్వామీ! అంటే నీవేమంటావో!! ఎన్నగలద్రోహిగా జీవించిన నేను నీతో ఇచ్చకాల మాటలు చెబితే నన్నుజూచి పరులు నవ్వకుండా వుంటారా? నా సంసారం మీద నాకు గల భక్తి చేతనే కోరి నేను నీ భక్తుడనయ్యాను. ఇక విజ్ఞానమెట్లుండునో నేను యెఱుగను. ఇంతలో ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను సులభముగా రక్షించితివి. నీవు నా అంతర్యామివై నన్ను వుద్ధరింపుమయ్యా!

★ **వంతుల విజ్ఞానము** – పోటీగా కలిగిన జ్ఞానము ★ **సంగతి** – చేరిక
★ **ఇచ్చకాలు** – ముఖప్రీతికొరకు చెప్పే మాటలు

సంఖ్య : II/150 రాగం : రామక్రియ పుట: 101

**49** మెచ్చు; మెచ్చుకుంటే మాను; మించి నే నాడకమాన
అచ్చపునీసూత్రధారి నవధారు దేవ ॥పల్లవి॥

వొక్కఁడ నే జీవుఁడను వోహో హరీ
పెక్కుబహురూపాలే పెంచి యాడితి
తక్కినయింద్రియములే తగుమేళము
అక్కజపువిద్యవాఁడ నవధారు దేవ ॥మెచ్చు॥

సూటి నించుకంతవాఁడఁ జూడవే హరీ
వీటిసంసారపుబారి విద్య లాడితి
పాటినాకర్మమే క్రియాభాషాంగము
ఆటవాఁడ నింతె నేను అవధారు దేవ ॥మెచ్చు॥

చేరి చిత్తగించుమీ శ్రీవేంకటేశ నేఁడు
మేరతో భక్తినేమోకుమీఁద నాడేను
యీరానిపదవులు యిచ్చితి నాకు
ఆరితేరి గెలిచితి నవధారు దేవ ॥మెచ్చు॥ **150**

**భావ దర్పణము :**

అన్నమయ్య ఈ కీర్తనలో దేవదేవుని అవధారు (హెచ్చరికతో ఆలకింపుము) అని వేడుకొంటున్నారు. నేను నీచేతి సూత్రధారిని (సూత్రముతో ఆడించబడే బొమ్మను). నీవు నా ఆట మెచ్చినా మెచ్చకున్నా అస్వతంత్రుడనైన నేను, నీవు ఆడించినట్లే నేను ఆడక మానను. నీవు నా ఆట మెచ్చినా మెచ్చకున్నా నా ఆట మానదు. ఓహో శ్రీహరీ! నేను జీవుడను. నీవు వేయమన్న వేషము ధరించి నాకు చేతనైనట్లు ఆడితినయ్యా! ఇక నా ఆటకి ఐదుగురు వాయిద్య సహకారం అందించారు. వారే నా పంచేంద్రియాలు. నేనెన్నో ఆశ్చర్యకరమైన విద్యలను నేర్చాను. వాటిని అవధరించు దేవా! నీ విశాలమైన సృష్టిలో నేను ఒక సూక్ష్మ జీవిని. ఓ శ్రీహరీ! నన్ను కూడా చూడవయ్యా! సంసారము అనే సన్నని తీగెపై నడుస్తూ అనేక "బారివిద్యలు" వీధులలో ఆడుతున్నాను. నేను చేయుచున్న "కర్మమే" (నా క్రియలకు) సూత్రవ్యాఖ్యానము కూడా. అదీ నేనే చేయుచున్నాను. కానీ ఆటమాత్రం నీ దర్శకత్వంలోనే నడుస్తున్నది. ఇన్నాళ్ళకి ఓ శ్రీవేంకటేశ్వరా! నేను ఇంకొక మంచి ఆట నేర్చాను. చిత్తగించుము తండ్రీ! క్రమముగా నీ భక్తి అనే త్రాటిపై ఆడేఆట అది. ఎట్లాగైతేనేమి నా కొత్త ఆటను మెచ్చి యెవ్వరూ ఇవ్వలేని పదవులు నాకిచ్చావు. అందులోనూ ఆరితేరి గెలిచెదను, అవధరింపుము ప్రభూ!

★ **మేరతో** – క్రమముగా ★ **పాటి** – న్యాయబద్ధమైన





సంఖ్య : XV/315 రాగం : సామంతం పుట: 212

**50** ఎంతపుణ్యమో నీకు హీనుని రక్షించితివి
యింత సేసితివి భాగ్య మేమి చెప్పీ నింకను ॥పల్లవి॥

సరుగ నానోర నీవు సంకీర్తన విన్నపుడే
అరసి మోక్ష మిత్తువని నే నమ్మితి
పరుల బంటుఁగాఁ జేయక యప్పటి నన్నేలి నపుడే
నరకమందుఁ బెట్టవు నమ్మితి నేను ॥ఎంత॥

కిమ్ముల నిఁక విన నీ కీర్తి గట్టినపుడె
నెమ్మి రక్షింతు వనుచు నే నమ్మితి
పమ్మి నా మదిలోనీ రూపము చూపినపుడే
క్రమ్మరఁ బుట్ట ననుచు గక్కన నే నమ్మితి ॥ఎంత॥

యిట్టె యోగక్షేమము వహించుకొని యున్నపుడె
నెట్టుకొనె నీ కృపని నే నమ్మితి
గట్టి శ్రీవేంకటేశ లోకదృష్టాంతమైనప్పుడే
వొట్టి సకలకర్మము లూడె నని నమ్మితి ॥ఎంత॥ **315**

**భావ దర్పణము :**

వినయం వుట్టిపడే కీర్తన చెబుతున్నారు పెదతిరుమలయ్య. ప్రభూ! సందేహం లేదు నేను హీనుడినే. నేను యెంత పాపం చేశానో నీకు తెలుసు. అయినా నీవు నన్ను రక్షించావు. నీకు ఎంత పుణ్యమో? ఇంక నా భాగ్యమేమని చెప్పగలను స్వామీ! నీకన్నా నాకు దిక్కెవరయ్యా! దేవా! నానోటితో పలికిన నీ సంకీర్తన నీవు విన్నపుడే నాకు నీవు తప్పక ముక్తినిస్తావని నేను నమ్మితిని. నన్ను పరుల బంటుగా చేయక నీబంటుగా చేసికొనినప్పుడే నీవు నన్ను నరకములో పెట్టవనే నమ్మకం కలిగింది. మరి ఇది పుణ్యముకాక మరేమిటి తండ్రీ? స్వామీ! కిమ్ముల (నిదానంగా) నీవు నాకు గొప్ప కీర్తినొసగినావు. అప్పుడే నీవు నన్ను రక్షించెదవనే నమ్మకం నాకు కలిగింది. పమ్మి (అతిశయించి) నామదిలో నీ రూపము చూపినప్పుడే, మళ్ళీ నేను పుట్టననే నమ్మిక నాకు కలిగింది. నీవన్నట్లు, నా యోగక్షేమాలు నీవు వహించినప్పుడే నీకృప నాపై వున్నదని నేను నమ్మితిని. గట్టివాడివైన శ్రీవేంకటేశ్వరా! నన్ను లోకంలో దృష్టాంతరముగా చేసినప్పుడే నా సకల కర్మలూ వూడిపడినవి అని నేను నమ్మితిని తండ్రీ! నేను ఇంకా కోరేదేమున్నది?

★ **క్రమ్మర** – మరల ★ **దృష్టాంతము** – నిదర్శనము

సంఖ్య : II/224 రాగం : కాంబోది పుట: 150

**51** ఏమని విన్నవింతు నిదివో నాభాగ్యము
కామించి మీశరణంటిఁ గమలారమణా ॥పల్లవి॥

కలది యందరికైతేఁ గర్మఫలము
కెలన నాకైతే నీకృపాఫలము
అల సురలకు మథితామృతము
నెలకొన్న నా కైతే నీనామామృతము ॥ఏమ॥

సకలాత్మలబ్రదుకు సంసారమూలము
ప్రకటించ నాకైతే నీపాదమూలము
వెకలిలోకులరతి వీధివీధిని నా -
త్రికరణ రతి నీదివ్యభావవీధిని ॥ఏమ॥

రంగుగ బాంధవ మందరకు బంధుజనులందు
సంగతి నాకు నీభక్తజనులయందు
అంగవించి శ్రీవేంకటాధిప నన్నేలితివి
చెంగట నాధ్యానము నీశ్రీమూర్తియందు ॥ఏమ॥ **224**

**భావ దర్పణము :**

ఈ కీర్తనలో అన్నమయ్య రతి అనేమాటను "అనురాగం" అనే భావనతో వుపయోగించారు. శరణాగతితో ఆయన శ్రీహరితో యేమంటున్నారో వినండి. ఓ కమలారమణా! నా భాగ్యమును యేమని వర్ణింతునయ్యా! యేరికోరి నీ శరణన్నాను. నీకు ఇంకా యేమని విన్నవించనయ్యా? స్వామీ! జీవులందరికీ కర్మఫలము అనుభవించక తప్పదు. మరి, నాకైతే నీకృపాఫలమే దక్కింది. నేనే భాగ్యశాలిని. దేవతలందరికీ సాగరమథనామృతమునిచ్చావు. ఎంత రగడ జరిగింది!! మరి నాకైతే **"ఓంనమో వేంకటేశాయ"** అనే నీనామామృతమునిచ్చావు. ప్రశాంతితో దానిని పొందాను. సకలాత్మలకు సంసారపీడ తప్పనిదే కదా! వాటి బ్రతుకంతా సంసారమూలముననే గడుస్తున్నది. మరి నాకైతే నీపాదమే మూలము. లోకులరతి (జనులయొక్క అనురాగము) వీధులలో జరిగే సంగతులమీదనే వుంటుంది. త్రికరణ రతి (మనోవాక్కర్మలద్వారా వెలిబుచ్చు నా అనురాగము) నీదివ్యమైన భావనావీధులలో వుంటుంది. ప్రభూ! అతిశయించిన బాంధవ్యాలన్నీ బంధుజనులతోనే వుంటాయి. కాని నాకు మాత్రం బాంధవ్యాలు నీ భక్తులతోనే. ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను సమీపించి యేలితివి. కాని, నాధ్యానమంతా నీ శ్రీమూర్తియందే వున్నది.

★ **అంగవించి** – సమీపించి ★ **కెలన** – పక్కన





రచయిత:

# అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు



| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | **ఎం.టెక్.** |
| ఉండేది | : | **ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,<br>సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.** |
| రంధి | : | **భగవన్నామ సంకీర్తన** |
| నచ్చింది | : | **శాస్త్రీయ సంగీతం** |
| నచ్చంది | : | **నక్కజిత్తులు** |
| మెచ్చింది | : | **సజ్జన సాంగత్యం** |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |